1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | జనవరి 31, 2024 | www.navatelangana.com

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఖానాపురం

ఫిబ్రవరి 12న జరిగే జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ కల్పన అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు చేతుల మీదుగా జాతీయ నులి పురుగు నిర్మూలన దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ కల్పన మాట్లాడుతూ... నులి పురుగు నివారణ దినోత్సవం సంతరించుకొని ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న యువతకు మందులు అందిస్తామని అన్నారు. ముఖ్యంగా రక్త పీడతను నివారించడానికి నులి పురుగులు మందులు పనిచేస్తాయని తెలిపారు. పాఠశాలలో, కళాశాలలో, అంగన్వాడి సెంటర్లలో ఆశ, ఏఎన్ఎం ల ద్వారా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాని, సూపర్వైజర్ రామలింగయ్య శ్రీలత, దేవిక, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడుకోవాలి

- ఇంటిగ్రేటెడ్ ప్రాసెస్ యూనిట్ కోసం 100 ఎకరాలు అవసరం
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

నవతెలంగాణ-పరకాల

ప్రభుత్వ భూములను అన్యక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోచారం గ్రామ శివారులో ప్రభుత్వ భూమి ఎంతో ఉందో పరిశీలించేందుకు అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ ,రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వ భూమి ఎక్కడ నుండి ఎక్కడి వరకు ఎంత ఉందో అని గుట్ట ఎక్కి భూమిని సందర్శించారు.అనంతరం వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలన ఎంతో ఘన చరిత్ర ఉన్న పరకాలను అన్ని రంగాల్లో అభివద్ధి చేయకపోవడం బాధాకరమన్నారు .జిల్లా కేంద్రంగా అభివద్ధి చెందాల్సిన పరకాలను, గ్రామస్థాయిలో సైతం అభివద్ధి జరగకపోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు పంటల ఉత్పత్తుల్లో రాష్ట్రంలోనే ముందున్నారని ,రెవిన్యూ కూడా జీఎస్టీ లో అధికంగా ఇస్తున్న ఘనత ఉందని అన్నారు. రైతుల ,యువతకు ఆదాయం పెంపొందించే దిశలో ప్రయత్నాలు చేయడం జరుగుతుందని అందులో భాగంగా పోచారం గ్రామ శివారులో సర్వేనెంబర్ 625లో ప్రభుత్వ గుట్టగా 235 ఎకరాలు ఉంటే అందులో 101 ఎకరం గుట్ట ప్రాంతం ,88 ఎకరాల అసైన్డ్ భూమి ,33 ఎకరాల పట్టా భూమి ,మిగిలిన 50 ఎకరాలు అసైన్ లో ఉందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ ప్రాసెస్ యూనిట్ ప్రారంభం కొరకు 100 ఎకరాలు ఉంటేనే పెట్టుబడి సంస్థలు ముందుకు వస్తాయని ఆ దిశలో భూమి సర్వే చేయించేందుకు సిద్ధంగా ప్రభుత్వం ఉందని అందుకు గ్రామ ప్రాంత ప్రజలు సహకరించాలని, వారం రోజుల్లో సంబంధిత శాఖ అధికారులు గ్రౌండ్ వర్క్ చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం గ్రామ శివారులో పరకాల పట్టణ మున్సిపాలిటీ డంపింగ్ చెత్తాచెదారం చేస్తున్న తీరును పరిశీలించి గ్రామంలో దుర్వాసన రాకుండా చూసే విధంగా ప్రత్యామ్నాయ ఆలోచనలో చేస్తామని ,గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఓ మహిళ రైతు కొందరు రైతు నాయకులు నీకు భూమి లేదంటూ బెదిరిస్తూ పొలానికి అడ్డుపడుతున్నారని చెప్పుకోవడంతో వెంటనే తహసిల్దార్ కు ఆ మహిళకు సంబంధించిన భూమి ఎంత ఉంది అనే పూర్తి సమాచారాన్ని తెలుసుకొని న్యాయం చేయాలని అన్నారు .అనంతరం గ్రామ రైతులు వర్షాకాలంలో అతిగా వర్షాలు పడటం వల్ల చిన్న చిన్న కుంటలు ,చెరువులు తెగేయని వాటికి మరమ్మతు చేసేలా చరోచూపాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, కట్కూరి దేవేందర్ రెడ్డి, నలుబాల కిష్టయ్య ,స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నుల వసూళ్లు చేయాలి

- బల్దియా అదనపు కమీషనర్ ఆనిసుర్ రషీద్

నవతెలంగాణ-వరంగల్



వంద శాతం పన్నుల వసూళ్లు చేయాలని బల్దియా అదనపు కమీషనర్, వరంగల్ సర్కిల్ పన్నుల వసూలు సూపర్ వైజింగ్ ఆఫీసర్ ఆనిసుర్ రషీద్ అన్నారు. మంగళవారం బల్దియా పరిధి లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్నుల వసూళ్ల విధానాన్ని క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కమీషనర్ ఆదేశించిన మేరకు పన్నుల వసూళ్లు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా జరగాలని, ప్రణాళిక బద్ధంగా వసూళ్లు కొనసాగాలని,పన్ను లు చెల్లిం చకుంటే నోటీసులు జారీ చేసి వసూళ్లు జరపాలని అన్నారు. టాప్ 100 మంది పన్ను చెల్లింపుల జాబితా తయారు చేసుకొని క్రమ బద్ధంగా ముందుకు సాగాలని అన్నారు. నగర వాసులు విధిగా పన్నులు చెల్లించి నగరా భివద్ధి కి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కష్ణ రెడ్డి, రెవెన్యూ అధికా రులు షాహ్జాది బేగం శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ తోనే సమగ్ర అభివృద్ధి : జేవీవీ

నవతెలంగాణ -నెక్కొండ

విద్యార్థులలో పాఠశాల స్థాయి నుంచి సైన్స్ అభ్యసన పట్ల అభిరుచిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని , సైన్స్ తోనే దేశ సమగ్ర అభివద్ధి సాధ్యమవుతుందని జన విజ్ఞాన వేదిక (జెవివి)జిల్లా బాధ్యులు ,చెకుముకి మండల కన్వీనర్ బూరుగుపల్లి శ్రవణ్ కుమార్, నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రంగారావు లు అన్నారు. నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చెకుముకి సైన్స్ సంబురాలలో భాగంగా సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండలంలోని 10 ప్రభుత్వ ప్రైవేటు ,ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ,టీచర్లు ఈ పోటీలో పాల్గొన్నారు.వచ్చే నెల 3న నర్సంపేటలో జిల్లా స్థాయి పోటీలు జరగనున్నట్లు చెకుముకి మండల కన్వీనర్ బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన 30 మంది విద్యార్థులకు హెచ్ఎం రంగారావు చేతులమీదుగా గైడ్ టీచర్ల సమక్షంలో ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు సుమలత ,శ్రీనివాసచారి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విశ్వ ప్రసాద్ ,సురేందర్ రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

సర్పంచ్ లకు ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ - పర్వతగిరి

మండల కేంద్రం లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మంగళవారం ఎంపీడీఓ చక్రాల సంతోష్ కుమార్ అధ్యక్షతన మండలం లోని 33 గ్రామాల సర్పంచ్ లు,ఎంపిటిసి లతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బాగంగా జీపిడిపీ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు, ఎంపిటిసి లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమల , వైస్ ఎంపీపీ రాజే శ్వరరావు, జెడ్పి కోఆప్షన్ సర్వర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ టి. వెంకట స్వామి, ఎంపీఓ పాక శ్రీనివాస్, సీనియర్ పంచాయతీ కార్య దర్శులు జే.సత్యనారాయణ, సదానం దం, రఘు, యాకూబ్ సర్పంచులు, ఎంపీటీసీల పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సన్న బియ్యం వితరణ

నవతెలంగాణ - పర్వతగిరి

మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన కొల్లూరి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులకు సర్పంచ్ చింతపట్ల ఆర్థిక సహాయం చేశారు. అలాగే సత్యసాయి ట్రేడర్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మండల అధ్యక్షుడు చిదురాల వేణుగోపాల్, రైతు కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్ పోకల శంకర్ ఇరువురు 25 కిలోల చొప్పున సన్న బియ్యం అందజేశారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ప్రచారం జరగాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై విస్తత ప్రచారం కల్పిం చాలని జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్ అవగాహన కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఏనుమాముల గో డౌన్ లో శిక్షణ కొరకు భద్రపరచిన రిజర్వ్ ఈవీఎం యంత్రాల్లో 8 యంత్రాలను, వీవీ ప్యాట్లను తీసి ఆయా నియోజకవర్గ ఈఆర్ఓ లను కేటాయించినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయం పరిధులైన వరంగల్ జిడబ్ల్యూఎంసీ కార్యాల యంలో, నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో, వర్ధన్నపేట బస్ స్టేషన్ లలో అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేససినట్లు తెలిపారు. ప్రజలందరికీ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ముఖ్యమైన ప్రదేశాల్లో విస్తతంగా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం మన హక్కు అని, ఈ వీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే దానిపై జిల్లా లోని ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవగా హన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమైన ప్రదేశాల్లో వీటి ద్వారా ఓటు హక్కు వినియోగంపై విస్తతంగా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఏనుమాముల గో డౌన్ లో శిక్షణ కొరకు భద్రపరచిన రిజర్వ్ ఈవీఎం యంత్రాల్లో 8 యంత్రాలను, వీవీ ప్యాట్లను తీసి ఆయా నియోజకవర్గ ఈఆర్ ఓ లను కేటాయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసు చంద్ర, స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీపీఆర్ ఓ అయూబ్ అలీ, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, జిల్లా ఇన్ఫోర్మాటిక్ అధి కారి అప్పిరెడ్డి, పర్యవేక్షకులు విశ్వ నారాయణ, జగదీష్, సదానందం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- ఎస్సై ఎం భరత్

నవతెలంగాణ-సంగెం



యువకులు రాబోయే భావితరాలకు మార్గదర్శకులుగా ఉండి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై ఎం భరత్ యువతకు సందేశం ఇచ్చారు. జాగతి పోలీస్ కళా బందం, వరంగల్ నగర పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ జా ఆదేశాల మేరకు సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్100, బాల్య వివాహాలు, సిసి కెమేరాలు, గుట్క,గంజాయి, డ్రగ్స్ వల్ల యువకులు వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని, మూఢ నమ్మకాలపై మేజిక్ షో,ముసలి తల్లితండ్రులను సరిగా చూసుకోవాలని,తదితర అంశాలపై పాటల ద్వార, సైబర్ క్రైమ్స్ నాటిక ద్వారా ప్రదర్శిస్తు1930 సైబర్ టోల్ నంబర్ గురించి కళాజాత ప్రదర్శనలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భరత్ మాట్లాడుతూ గ్రామాలలో యువకుల పాత్ర ముఖ్యమైనదని, గ్రామాభివద్ధి వారి వల్లే సాధ్యమవుతుందని, గ్రామాలలో అలజడి లేకుండా శాంతిభద్రతలను కాపాడే బాధ్యతను తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సీతారాములు, కానిస్టేబుల్ శంకర్, కళాబందం ఇంచార్జి ఉమెన్ ఏ ఎస్సై నాగమణి, సభ్యులు, హెడ్ కానిస్టేబుళ్ల విలియమ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నారాయణ,విక్రమ్రాజు, చిరంజీవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

నవతెలంగాణ-నెక్కొండ



పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రావుల హరీష్ రెడ్డి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బక్కి అశోక్,రావుల హరీష్ రెడ్డి,పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ.అహింసా మార్గంలో భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గొప్ప నాయకుడు మహాత్మాగాంధీ అన్నారు. ప్రతిఒక్కరు వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయి కష్ణ, మండల ఉపాధ్యక్షులు బానోత్ శంకర్ నాయక్, మేజర్ గ్రామ పంచాయితీ వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ 76 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్ జాతిపిత మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. నడికూడ మండల పార్టీ ప్రధానకార్యదర్శి డాక్టర్ మలహాల్ రావు, రాయపర్తి ఎంపీటీసీ పర్నెం శ్రీలత -మల్లారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్ల నవీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం కుమారస్వామి, రాష్ట్ర మాల మహానాడు అధికార ప్రతినిధి నీరాటి రాములు, కాంగ్రెస్ నాయకులు దుప్పటి మల్లేష్, అనిల్, విజేందర్, సుధయ్య, దుప్పటి అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వేములపల్లి ప్రకాష్ రావు మహాత్మా గాంధీ చిత్రపటానికి మంగళవారం పూలమాలవేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీని స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాని, ఎంపీఓ రవి, పర్యవేక్షకులు వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పథ్వీరాజ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, కార్యదర్శులు దోమల రజిత, సురేష్, హుస్సేన్, అబేదా బేగం, కంప్యూటర్ ఆపరేటర్ గుణ శ్రీ, ఆఫీస్ సబార్డినేట్ చంద్రమోహన్, రమేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్

నవతెలంగాణ-పరకాల



ప్రభుత్వ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ తో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు టాయిలెట్స్, మరుగుదొడ్లు; ఎస్ఎంహెచ్ హాస్టల్స్ కు సొంతభవనాలు లేవన్నారు. విద్య రంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు ఉదతం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షులు బొచ్చు ఈశ్వర్, సాయి, సందీప్, అవినేష్, చింటూ, రాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట :

విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ వర్ధన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ సభ్యత్వాలు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామని 2018లో హామీ ఇచ్చారు కానీ ఐదు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికి ఆ ఊసే లేదన్నారు. అందరూ ప్రభుత్వ కళాశాలలో చేరుతుంటే గత ప్రభుత్వము నిమ్మకు నీరు ఎత్తనట్టుగా వ్యవహరించిందన్నారు. శిధిలా వ్యవస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనంఠ మంజూరు చేసిందని, నూతన భవనం నిర్మించాలని అన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. వర్ధన్నపేట మండల కార్యదర్శి ఇస్లావత్ కళ్యాణ్ అధ్యక్షుడు ఎండి సమీర్ ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు రామ్ చరణ్ రాజు మోక్షిత్ అనూష పల్లవి రుచిత తదితరులు పాల్గొన్నారు

ఉత్కృష్ట సేవా పథక గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ - మట్టేవాడ



వరంగల్ సైబర్ క్రైమ్ ఏసిపి విధులు నిర్వహిస్తున్న కూజ విజయ్ కుమార్ ముదిరాజ్‌కి ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 'ఉత్కృష్ట సేవా పథకం' అవార్డు అందించింది. మంగళవారం మెపా - (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విజయ్ కుమార్‌ని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోనీ ఏసిపి ఆఫీస్ లో మేపా ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మాన గ్రహీత విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో బాధ్యత పెరిగిందని, సమాజ సేవలో యువత ముందుకు రావాలనీ, ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా కాకుండా యువత అవగాహన కలిగి ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర నాయకులు నీరటి రాజు,డా. ఈర్ల రాకేష్,కూతురు రాజు,ఆకుల శివ రాజ్ ముదిరాజ్, రాజు,బొల్లి.కిషోర్ ముదిరాజ్ లతో పాటు ముదిరాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శికి సమ్మె నోటీసు

నవతెలంగాణ-కాశిబుగ్గ



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సంగయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ముక్కెర రామస్వామి, గంగుల దయాకర్, గన్నారపు రమేష్, పుల్ల రమేష్, జగదీశ్వర్, ఎండి కాసిం, కేశవులు సుధాకర్, పాషా, పాల్గొన్నారు.

నేషనల్ కబడ్డీ టోర్నమెంట్ కు ఎంపికైన విక్రమ్

నవతెలంగాణ - చెన్నారావుపేట

మండలంలో అక్కల్ చెడ గ్రామానికి చెందిన యువకుడు నేషనల్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఒలంపిక్ ప్రెసిడెంట్ ఎండి అజిత్ ఖాన్, హనుమకొండ ప్రెసిడెంట్ సారంగపాణి తెలిపారు.ఈ నెల 12న సిద్దిపేటలో జరిగిన స్టేట్ కబడ్డీ టోర్నమెంట్లో హనుమకొండ జిల్లా జట్టు నుంచి ప్రతినిత్యం వహించిన భూక్య విక్రమ్ అత్యంత ప్రతిభ కనబరిచి నేషనల్ కబడ్డీ టోర్నమెంట్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విక్రమ్ ఫిబ్రవరి 1న బాచుపల్లి (హైదరాబాద్) లో జరిగే నేషనల్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలో పాల్గొంటారన్నారు. విక్రమ్‌ను క్రీడాకారులు, నాయకులు, ఉపాధ్యాయులు అభిమానించారు.



రోగులకు పండ్లు, దుస్తులు పంపిణీ

నవతెలంగాణ - మట్టేవాడ

జాతీయ కుష్టు నిర్మూలన, పక్షోత్సవాల కార్యక్రమంతోపాటు గాంధీజీ వర్ధంతిని పురస్కరిం చుకొని మంగళవారం వరంగల్ పోర్టు రోడ్డు లోని ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, దుస్తులు అందజేశారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ నరసింహారెడ్డి ఆరోగ్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వచ్చే నెల ఫిబ్రవరి 13 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు కుష్టు పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. లక్షణాలు కలిగి ఉన్న వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తారని, అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందిస్తారని అన్నారు. కుష్టు రహిత సమాజాన్ని సాధించడానికి అందరూ సహకారమందించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ రవీందర్, అనుపమ, డీపీఎంఓ సువార్త, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలించాలి : అడిషనల్ డీఎంహెచ్ఓ

కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని డీప్యూటీ డీఎంహెచ్‌ఓలు మదన్‌మోహన్‌రావు, ఎండి యాకుబ్ పాషా అన్నారు. మంగళవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినం, గాంధీ వర్ధంతి సందర్భంగా ఆనంద్‌నగర్‌లో జరిగిన సమావేశంలో కుష్టు వ్యాధి నిర్మూలన కోసం అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలో లెప్రసీ బాధితులకు సంక్షేమ కార్యక్రమాలు, చికిత్స, తదితరవాటిపై వివరించారు. జిల్లా ఆరోగ్య విద్యా అధికారి సందెల శ్రీనివాస్ మాట్లాడారు. స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మోహన్, డీపీఎంఓలు గోపాల్ రెడ్డి, సతీష్ రెడ్డి, కొమరయ్య, రవీందర్, ప్రభాకర్, నరసయ్య, సీహెచ్ఓ మాధవరెడ్డి, సదానందం, భద్రయ్య, శివ రాములు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు పద్మ శుభాకాంక్షలు

నవతెలంగాణ - పర్వతగిరి



హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో మంగళవారం జరిగిన సమా వేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ గా నియమి తులైన మహేష్ కుమార్ గౌడ్ లను వర్ధన్నపేట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా సీనియర్ నాయకు రాలు తొర్రి పద్మ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలు వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలి పారు. ఆమె వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ప్రొఫెసర్ కూరపాటి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



మంత్రులు కొండా సురేఖ, సీతక్కను మంగళవారం ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కూరపాటి వెంకట్ నారాయణ మాట్లాడుతూ మన ఓరుగల్లు ఆడబిడ్డలకు మంత్రి వర్గంలో ఇద్దరి మహిళలకు స్థానం కల్పించడం మన జిల్లాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దయాల సుధాకర్, న్యాయవాదులు గుణిగంటి శ్రీనివాస్ గౌడ్, పెళ్లికార్తిక్, చింత నిఖిల్, కుమార్, అశోక్ పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-సుబేదారి



హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అదే విధంగా వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, సెంట్రల్ జోన్ డిసిపి ఎంఎ భారీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగరాలే, తదితరులు గాంధీజీ చిత్రపటం వద్ద పూలను వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా గాంధీకి నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాల పాటు అధికారులు, ఉద్యోగులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు కిరణ్ కుమార్, భోజరాజు, కిషోర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఫలాలు అందరికీ అందేలా చూడాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నవతెలంగాణ-దుగ్గొండి



గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఫలాలు అందేలా చూడాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తొగర్రాయి, శివాజీ నగర్, దుగ్గొండి, గొల్లపల్లి, చంద్రయ్యపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు అందించడానికి గ్రామపంచాయతీలు ఎంతో తోడ్పడతాయన్నారు. ప్రజలకు మేలైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆరుగ్యారెంటీలతో పాటు, ఇందిరమ్మ సంక్షేమ పథకాలు అందేలా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలాభద్రయ్య, వైస్ ఎంపీపీ జైపాల్ రెడ్డి, పిఆర్ ఇఇ ఇజ్జగిరి, మండల పంచాయతీ అధికారి శ్రీధర్ గౌడ్ ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచులు ఓడేటి తిరుపతిరెడ్డి, లింగంపల్లి ఉమా రవీందర్, తోకల మంజుల నరసింహారెడ్డి, నీలం పైడయ్య, పల్లాటి భవాని కేశవరెడ్డి, సొసైటీ చైర్మన్ సుకినే రాజేశ్వరరావు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ హౌస్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- రూ. 2 వేలు జరిమానా, మెమో జారీ - శుభ్రత పాటించకుంటే సీజ్ చేస్తాం
- ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి కృష్ణమూర్తి

నవతెలంగాణ-దుగ్గొండి



మండలంలోని గిర్నిబావి గ్రామం ప్రధాన రహదారిపై ఉన్న శ్రీ గణపతి స్వీట్‌హౌస్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఆ స్వీట్ హౌస్‌లో నిత్యం పరిశుభ్రత పాటించకపోవడంతో కష్టమర్ల ఫిర్యాదు మేరకు మంగళవారం ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి కృష్ణమూర్తి అధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారిపై ఉండడంతో నిత్యం దుబ్బధూళి తినుబండారాలపై పడుతున్నదని అధికారి కృష్ణమూర్తి తెలిపారు. స్వీట్‌హౌస్‌లో మంచి నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వాటర్ స్టోరేజ్ ఫ్రిజ్ వద్దనే డస్ట్ బిన్, చేతులు కడుక్కోవడానికి అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు.అలాగే తినుబండారాలు తయారు చేసే చేసే ప్రాంతం దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్రంగా ఉందని అధికారి తెలిపారు. ఈ స్వీట్ హౌస్‌లో నిర్వాహకులు అపరిశుభ్రంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించామని దీంతో రూ. 2 వేలు జరిమానా విధిస్తూ మెమో జారీచేసినట్లు పేర్కొన్నారు.మరోసారి ఈ స్వీట్ హౌస్‌తో పాటు ఇతర హోటళ్ళు,బిర్యానీ సెంటర్స్‌లతో పునరావృత్తం ఐతే సీజ్ చేయక తప్పదని జిల్లా అధికారి కృష్ణమూర్తి హెచ్చరించారు.ఈ తనిఖీల్లో స్థానిక గిర్నిబావి పంచాయితీ సెక్రటరీ వైనాల రాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఐనవోలు



మండల కేంద్రంలో మంగళవారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘము జీఎంపీస్ మండల అధ్యక్షులు పిడుగు దయాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు యాదవ్, అఖిల భారత యాదవ సంఘ అధ్యక్షుడు రాజారపు రాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు చిగుర్ల చేరాలు యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్ గౌడ్‌తో కలిసి జీఎంపీస్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంగెం శ్రీను ,రావుల రవికుమార్, సామాజిక కార్యకర్త రాజారపు రాజ్ కుమార్, గాజు రాజు, పులిగిల్లా కుమారస్వామి, కోత్తూరి సునీల్, బరిగెల భాస్కర్, రహీమ్ పాషా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్టురహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి : సర్పంచ్ కందగట్ల రవి

నవతెలంగాణ-శాయంపేట



కుష్టు రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ కందగట్ల రవి అన్నారు. శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ 75వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ బ్యాక్టీరియా వలన కుష్టి వ్యాధి వస్తుందని, చర్మానికి, నరాలకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి 3 నుండి 5 ఏళ్ల కాలం పడుతుందని, దీనికి లింగ బేధం, వయస్సుతో సంబంధం లేదన్నారు. వంశపారంపర్యంగా సంభవించే వ్యాధి కాదన్నారు. ఈ వ్యాధిని ఎండిటి చికిత్సతో 6 నెలల నుండి 12 నెలల్లో పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. చర్మంపై ఏ రకమైన మచ్చలు ఉన్న సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, కుష్టు వ్యాధి పట్ల ఉన్న భయాన్ని విడనాడాలని డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత సొసైటీ మాజీ కార్యదర్శి మామిడి అశోక్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, లైన్ ఇన్స్పెక్టర్ దామోదర్, నాయకులు బూర కుమారస్వామి, ధైనంపల్లి బాబు, వైద్య సిబ్బంది వెంకటేశ్వర వర్మ, చలపతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భవన్‌లో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, తోట వెంకన్న, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, అజీజ్ ఖాన్, బంక సరళ, మొహమ్మద్ అంకుష్ , బంక సంపత్, తౌటం రవీందర్, రహీమున్నిసా బేగం, నాయిని లక్ష్మారెడ్డి, బొమ్మతి విక్రమ్, వీరగంటి రవీందర్, గుంటి కుమార్, సుంచు అశోక్, నలుబోల సతీష్ బొంత సారంగం, ఎర్ర మహేందర్, డివిజన్అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కౌకొండ గ్రామంలో యువకుడి దారుణ హత్య

నవతెలంగాణ-నడికూడ



మండలంలోని కౌకొండ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకొండ గ్రామానికి చెందిన మేకల యుగంధర్ (36) అదే గ్రామానికి మేకల సిద్దు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి యుగంధర్‌ను గొడ్డలితో నరికినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరగగా వెంటనే అతని బంధువులు, స్నేహితులు పరకాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. పాత కక్షలతో హత్య చేశారంటూ మేకల సిద్దు పై మేకల రాజవీరు మంగళవారం ఫిర్యాదు చేయగా దామెర ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేయగా, పరకాల రూరల్ సీఐ మల్లేష్ దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు మేకల సిద్దు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు, పోలీసు జాగిలాలు పరిశీలించి, ఆధారాలు సేకరించారు. గ్రామంలో ఎలాంటి గొడవలు కాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మృతుడి కుటుంబాన్ని బిజెపి నేత పరకాల కాంటెస్ట్ ఎమ్మెల్యే కాళీ ప్రసాద్ రావు పరామర్శించి నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. ఉప్పలయ్య

నవతెలంగాణ-సుబేదారి



ఫిబ్రవరి 16 దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని హనుమకొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఫిబ్రవరి 16న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, దేశవ్యాప్తంగా బిజెపి అనుబంధ బిఎంఎస్ మినహా దేశంలోని అన్ని రాజకీయ సంస్థల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది మంది కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనాలని, సమ్మె నోటీస్ జిల్లా డీసీఎల్ రమేష్ బాబు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టి.ఉప్పలయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పది ఏండ్ల కాలంలో దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, స్కీములన్నిటిని బలహీనపరుస్తూ దోపిడి వర్గాలకు, యాజమాన్యాలకు, అనుకూలంగా లేబర్‌కోడ్స్ తీసుకొచ్చి శ్రమ దోపిడీ చేస్తుందని విమర్శించారు. అలాగే 8 గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటల పని దినాన్ని తెస్తూ కార్మిక వర్గాన్ని మరింత దోపిడీ గురిచేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా కోశాధికారి రాచమల్ల వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శులు పుల్ల అశోకు, కూస రాజేష్, గద్దల కుమార్, వల్లపు రాజు, జిల్లా ఉపాధ్యక్షులు, మల్లెపు లింగమూర్తి, శ్రీను, నారాయణ, పాల్గొనడం జరిగింది.

సాహిత్యం ప్రజలను దగ్గర చేస్తుంది : కేయూ వీసీ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



సాహిత్యం ప్రజలను దగ్గర చేస్తుందని, తద్వరా సామజిక చైతన్యం కలుగుతుందని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంట్ సెమినార్ హాల్‌లో తెలుగు విభాగ అధిపతి ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షతన కాకతీయ విశ్వవిద్యాలయం వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అద్వర్యంలో జనవరి 30, 31 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సు వల్లంపట్ల సాహిత్యం సామజిక చైతన్యం అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. గొప్ప చైతన్య శీలి, ఆచరణవాది, బహుముఖ ప్రజ్ఞాశాలి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్ రావు అన్నారు.సాహిత్యం, సామజిక చైతన్యం వేరు వేరు కాదన్నారు. అన్నింటికీ మూలం సామజిక చైతన్యం అన్నారు. వల్లంపట్ల ప్రభుత్వ కార్యక్రమాలను కళా రూపాల ద్వార ప్రజలలోనికి తీసుకోని వచ్చి చైతన్య పరుస్తున్నారన్నారు. హేతుబద్ధత గీటురాయి అన్నారు. వాదాలు ఎవైన దానికి వేదిక తెలుగు విభాగం అవుతుందని విభాగంలో జరుగుతున్నా పరిశోధన క్రమాన్ని కొనియాడారు. పరిశోధనకు వల్లంపట్ల జీవితాన్ని తీసుకోవటం, ఇతర గొప్ప వ్యక్తుల జీవితాన్ని పరిశోధన అంశంగా తీసుకోవటం నూతన ప్రక్రియ అని, సాహిత్యం పై చర్చలతో సామజిక చైతన్యం సాధ్యం అన్నారు. విశిష్ట అతిథి బి.ఎస్‌రాములు మాట్లాడుతూ సమాజంలోని సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి 5 దశాబ్దాల కాలంగా తన కలాన్ని, గలాన్ని అర్పించి నూతన సమాజ నిర్మాణానికి నిర్విరామంగా కృషి చేస్తున్నా వల్లంపట్ల నాగేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. వేదన పీడన లేని సమాజాన్ని కోరుకునే అతి తక్కువ మంది కవులలో వల్లంపట్ల నాగేశ్వరరావు ఒకరిని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాకూర్, కవయిత్రి, రచయిత్రి అనిశెట్టి రజిత, ఆచార్య పి.కృష్ణమాచారి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్ రావు, కామర్స్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.నరసింహాచారి, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు ఆచార్య రాజేందర్ కట్ల, ఆచార్య పి. వరలక్ష్మీ, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

వేలేరు మండలాభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

నవతెలంగాణ-వేలేరు



వేలేరు మండల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా అని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రం వేలేరులోని రైతు వేదికలో మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 1తో సర్పంచుల పదవీకాలం పూర్తికానున్న సందర్భంగా మండలంలోని 14 గ్రామాల సర్పంచ్లను సన్మానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాటాడుతూ వేలేరు మండల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా, అధికారులు ప్రజాప్రతినిధులు, సమన్వయంతో పనిచేసి రాబోయే కాలంలో వేలేరు మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. గోదావరి ఎత్తిపోతల పథకాన్ని వచ్చే ఖరీఫ్ కాలం నాటికి పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాల చెరువులకు నీరును తెప్పిస్తా, మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు మండల కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసే బాధ్యత నాది అని అన్నారు. మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశంలో మండలంలోని ప్రభుత్వ విభాగాల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల ప్రజా పరిషత్ సమావేశం ఉంటుందని పూర్తి వివరాలతో సమావేశానికి హాజరు కావలసిన బాధ్యత అధికారులపై ఉందని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో సర్పంచులు మాట్లాడుతూ తాము చేసిన పనులకు పెండింగ్ బిల్లులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని సర్పంచ్లంతా గత ప్రభుత్వ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారే కావడంతో పెండింగ్ బిల్లులు వచ్చేలా కృషి చేయాలని అధికారులను కోరారు. కానీ వారి లోపల అంతర్యం బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే బిల్లులు రాని పరిస్థితి కారణంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం మూలాన పెండింగ్ బిల్లులు ఇంకా రావాల్సి ఉందని చెప్పలేక లోపల మదన పడుతున్న పరిస్థితి కనిపించింది. గత ప్రభుత్వ కాలంలోనే మండల అభివృద్ధి జరిగిందని చెబుతూ ఇంకా పెండింగ్ బిల్లులు ఉన్నాయని తెలపడం శోచనీయం. గతప్రభుత్వ ఆదేశం మేరకు అధికారులు మెడ మీద కత్తి పెట్టి మండల అధికారులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించారని గత ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు జరిగాయని తెలుపుతూనే బిల్లులు సకాలంలో విడుదల చేయలేక పెండింగ్‌లో ఉన్నాయని గట్టిగా విమర్శించని పరిస్థితి స్పష్టంగా సమావేశంలో అగుపించింది. మండల జడ్పీటీసీ చాడ సరిత మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నాలుగు సంవత్సరాలుగా ఇన్చార్జి మెడికల్ ఆఫీసర్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల ఆసుపత్రిగా మార్చాల్సిన అవసరం ఉందని అలాగే మెడికల్ ఆఫీసర్ ను ఒక గైనకాలజిస్టును ఆసుపత్రిలో ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల ఆసుపత్రిగా మార్చేలా చొరవ చూపాలని కడియం శ్రీహరిని కోరారు. మండల విద్యాధికారి ఏ.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో తమ మండల విద్యా వనరుల కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయం నర్సరీలు ఉండడం మూలాన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అవి మార్చే విధంగా కృషి చేయాలని తెలుపుతున్న సందర్భంలో ఎంపీపీ సమ్మిరెడ్డి జోక్యం చేసుకొని వేలేరు హైస్కూల్ వెనకాల ఉన్న గతంలో తాత్కాలికంగా కేజీబీవీ పాఠశాల నడిచిన భవనం కూడా తమ కావాలని ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అనడం శోచనీయం. వెంటనే తాత్కాలికంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయము నడుస్తుందని పర్మినెంట్ భవనం ఏర్పాటు చేసిన తర్వాత అక్కడికి వెళ్లి పోతామని తెలిపారు. ప్రభుత్వ భూములలో అక్రమ మొరం దందా జరుగుతుందని తరచూ మీడియాలో వస్తున్న విషయం చర్చకు వచ్చినప్పుడు ప్రభుత్వ భూముల వద్ద బోర్డులు బిగించి అక్రమ మొరము దందాకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు కడియం శ్రీహరి సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, జడ్పిటిసి చాడ సరిత, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాయిత మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ అంగోత్ సంపత్, ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న, తాసిల్దార్ కోమి, ఎంపీవో విమల, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

యోగా మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తుంది

వైస్ ప్రిన్సిపల్ ఆచార్య అనుమంతు

నవతెలంగాణ-సుబేదారి

యోగ భారతీయ సాంప్రదాయాలలో అతి ప్రాచీనమైన అభ్యసన, దీనిని ప్రతి విద్యార్థి ఆచరించి తీరాలని అభ్యసన చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య హనుమంతు అన్నారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగ ,మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆర్ట్ ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగ అభ్యసన, మెడిటేషన్ పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ నేడు ఆధునిక యుగంలో ఎదుర్కొంటున్న ఆవేశపూరితమైన విధానాలకు యోగ, మెడిటేషన్ పరిపూర్ణమైన ప్రశాంతతను అందజేస్తుందని ఆయన అన్నారు. యోగ భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలకు విస్తరించిందని మన పూర్వీకులు యోగాను ఎంతో శ్రద్ధతో నిర్వహించేవారని దీనిని నిర్వహించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అచ్చయ్య, రాధిక, రాజు, చంద్రాల, విద్యార్థులకు యోగ శిక్షణ, మెడిటేషన్ విధానాన్ని అభ్యసన విధానాన్ని నేర్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల పిఆర్ఓ డాక్టర్ ఆదిరెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి డాక్టర్ చందులాల్, డాక్టర్ హరి కుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిట్ల పురాణానికి ప్రజా ప్రజాస్వామ్యంలో చోటు లేదు : ప్రొఫెసర్ వెంకటనారాయణ

నవతెలంగాణ-హన్మకొండ చౌరస్తా

ఇటీవలి శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత పది సంవత్సరాల నిరంకుశ అహంకారపూరితమైన పరిపాలన అనుభవించి అధికారం కోల్పోయిన నాయకులు అసహనానికి గురి కావడం దురదృష్టకరం అన్నారు. ఓ ప్రకటనలో ఆయన మంగళవారం మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వాకం అప్పుల కుప్పగా మార్చిన అధిక వ్యవస్థ స్తంభించిపోయిన పరిపాలన వ్యవస్థ అవినీతితో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలు గత ప్రభుత్వ యొక్క అభివృద్ధికి చిహ్నాలుగా కనిపిస్తున్నాయని గుర్తుంచుకోవలసి ఉంది. గత పది సంవత్సరాలలో ప్రభుత్వ ఆస్తులు భూములు అన్యాక్రాంతమైపోయినాయని, అమలు కాని ఆకాంక్షలు, హామీలు ప్రజలకు చేదు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయని గుర్తుంచుకుంటే బాగుంటుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని వందలాది మంది నాయకులు కుటుంబ సభ్యులు ఆస్తులు సంపద 100 ఎకరాల భూములు ఫామ్ హౌస్‌లు సొంతం చేసుకున్న విషయం ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుంచుకోవాలి.గత పది సంవత్సరాలు విధ్వంసం గమనించిన ప్రజలు, సభ్య సమాజం చిత్కారం చేస్తున్నదని కూడా గమనించకుండా నిత్యం తిట్ల పురాణాన్ని వల్లించడం నాగరికత లక్షణం కాదని ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబం నుండి ముఖ్యమంత్రి ఇద్దరు మంత్రులు ఒక రాజ్యసభ మెంబరు ఒకరి ఎమ్మెల్సీ బంధువులందరికీ ఉద్యోగాలు సర్దిపెట్టుకున్న మీకు ప్రజాజీవనంలో మాట్లాడే హక్కు ఉందా అని సామాజికవేత్తలు ప్రజాస్వామ్యవాదులు సామాజిక న్యాయ కోవిదులు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. దీనికి ముందు సమాధానం చెప్పండి. ఎవరి జాకీర్లని ప్రభుత్వ వ్యవస్థ అంతా ఒక కుటుంబం సొంత జాగీర్గా మార్చుకున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల రామారావు ఇటీవల ప్రతిరోజు ప్రత్యర్థి రాజకీయ నాయకులను పరిష భాషతో విమర్శించడం, పిట్ల పురాణం వల్ల వేయడం తెలంగాణ ప్రజల సంస్కృతి కాదని గుర్తుంచుకోవాలి. భాష కాసంత నియంత్రణతో వాడడం అవసరమని యువ నాయకునికి విజ్ఞప్తి చేశారు.



బిజేపి ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి

నవతెలంగాణ-హనుమకొండ

సిఐటియు అఖిలభారత వర్కింగ్ కమిటీ సమావేశాలు 2024 జనవరి 31 ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో హనుమకొండలోని బాలవికాస్‌లో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగనున్నాయని సిఐటియు హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి తెలిపారు. జాతీయ సమావేశాల సందర్భంగా ఈనెల 31న వేయిస్తంభాలగుడి నుండి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ప్రదర్శన నేరెళ్ల వేణు మాధవ్ హాల్‌లో బహిరంగ సభను జయప్రదం చేయాలని గ్రేటర్ వరంగల్ 31 డివిజన్ న్యూ శాయంపేట, ఇందిరా గాంధీ విగ్రహం బస్ స్టాప్ వద్ద మంగళవారం ఆల్ షాప్ షాపింగ్ మాల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం యూనియన్ ఆధ్వర్యంలో బహిరంగ సభను జయప్రదం చేయాలని వాల్ పోస్టర్స్‌ను హనుమకొండ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి ఆవిష్కరించారు. అనంతరం సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 10 సంవత్సరాలు పూర్తయింది ఇంకా రైతన్న కార్మిక వర్గ ప్రజలను సమస్యలను పరిష్కరించలేదు భారత్ వెళ్లిపోతుందని, అచ్చాదిన్, విశ్వగురు ,ఆత్మనిర్భర్ భారత్ ,మేకిన్ ఇండియా వంటి మోసపూరిత వాగ్దానాలు చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి పార్టీ బిజెపి అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నేడు ఉద్యోగ కల్పన పడిపోయిందని, కేంద్ర ప్రభుత్వం పేదలకు అనుకూలంగా వ్యవహరించకుండా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. షాప్ షాపింగ్ మాల్స్‌లలో వివిధ ప్రవేట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడులు, ఎంపి యాక్ట్ విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర కల్పించడం రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకులపై నియంత్రణ తదితర ప్రధానమైన సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త ఆందోళనకు రూపకల్పన చేయడం కోసం 2024 ఫిబ్రవరి 1 2 3,న జరుగు సిఐటియు జాతీయ సమావేశాలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రమేష్, గోనే శ్యాం, తోట శ్రీనివాస్, కోటేశ్వర్, యన్.రాజు, రాజు, సుధాకర్, గుర్రం రాజు, రాజేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పొదుపే జీవితానికి వెలుగు : రవీందర్

నవతెలంగాణ-ఆత్మకూరు

పొదుపే మన జీవితానికి వెలుగు సంఘ వ్యవస్థాపకులు నీల రవీందర్ పిలుపు నిచ్చారు. చేయూత మహిళా పొదుపు సంఘం ప్రథమ వార్షిక మహాసభ హౌజుబుజుర్గు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం సంఘ అధ్యక్షులు నీల రవీందర్ అధ్యక్షతన మహా సభ నిర్వహించడం జరిగినది. ఈ మహాసభకు హాజరైన సంఘ సభ్యులందరికీ లెక్కలతో కూడిన వ్రాత పూర్వక మైనటువంటి వివరాలు అందరికీ అందించి చదివి వినిపించడం జరిగినది. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు నీల రవీందర్ మాట్లాడుతూ 2022 నవంబర్లో 320 మంది సభ్యత్వంతో ఏర్పడి నాలుగు లక్షల 20వేల రూపాయలు పొదుపులుగా జమ చేసుకోవడం జరిగిందన్నారు. అవసరము ఉన్న సభ్యులకు ఒక్కరికి పదివేల రూపాయలతో అప్పులు ఇచ్చి వారి అవసరాలను తీర్చగలిగింది అన్నారు. ఎవరి అవసరాలను వారే తీర్చుకోలేరు కనుక ఇలాంటి సంఘంలో సభ్యులుగా చేరితే మీ కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటులను అందిస్తుందన్నారు. గ్రామంలో అర్హత కలిగిన ప్రతి మహిళకు సంఘంలో సభ్యత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. అప్పు తీసుకున్నటువంటి సభ్యులు సక్రమంగా తన అప్పును పొదుపును ప్రతినెల సక్రమంగా చెల్లించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.రూ.2 లక్షల రూపాయలు సంఘానికి ఆదాయం రావటం జరిగినదని. ప్రతి సభ్యునికి బోనస్ రూపంలో తిరిగి వారి ఖాతాకి జమ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో సభ్యత్వాన్ని పెంచి అప్పు అర్హత కూడా పెంచి వారి యొక్క కుటుంబ అవసరాలు తీర్చే విధంగా ఈ సంఘం తోడ్పాటిస్తుందని. చనిపోయినటువంటి సభ్యులకు కూడా ఇన్సూరెన్స్ పరంగా కూడా అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మహాసభలో సంఘ వ్యవస్థాపకులు నీల రవీందర్ కెనరా బ్యాంకు ఆత్మకూరు శాఖ మేనేజర్ ఎండి మతీన్ సిద్దీక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ చే పాలకవర్గ సమక్షంలో శాలువ తో సత్కరించారు.

పాలకవర్గం ఎన్నిక

అధ్యక్షులు నీల రవీందర్, ఉపాధ్యక్షులు సయ్యద్ వలి, పాలకవర్గ సభ్యులుగా బొడిగె రాంబాబు,షేక్ హుస్సేన్, సయ్యద్ మౌలా, షేకు అఫ్జల్, గుండెబోయిన రాజు,నీలం కుమారస్వామి, షేక్ మౌలా, మంగళపల్లి నవీన్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఆత్మకూరు శాఖ మేనేజర్ ఎండి మథిన్ సిద్దీక్, గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ మేడం సంఘ పాలకవర్గం, సంఘ సభ్యులు 300 మంది పాల్గొన్నారు.

మార్కెట్, అంగడి ఏర్పాటు అభినందనీయం

నవతెలంగాణ-ఆత్మకూర్

ప్రజలకు అందుబాటులోనే కూరగాయల మార్కెట్, అంగడి ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత సర్పంచి పర్వతగిరి రాజు పట్టుదల ఫలితమేనని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కొనియాడారు. మంగళవారం ఆత్మకూర్ మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలమును గుర్తించిన సర్పంచ్ పర్వతగిరి రాజు దాతలను ఒప్పించి వారి సహకారంతో నూతన భవనం, కూరగాయలు అమ్ముకునేందుకు వ్యాపార సముదాయాన్ని, అంగడికి కావలసిన స్థలములో వేలాది ట్రిప్పుల మారాం పోసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సర్పంచ్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సర్పంచి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని నేతలు ఎన్నో అడ్డంకులు సృష్టించిన కూడా అధిగమించి ఆత్మకూరు పేరును జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డులను అందుకొని జాతీయ స్థాయికి ఎంపిక కావడం అంటే మామూలు విషయం కాదన్నారు. దాని వెనుక ఎంతో కృషి పట్టుదల ఉంటే తప్ప సాధ్యం కాదని ఎమ్మెల్యే ప్రశంసల జల్లుతో సర్పంచ్ రాజు పై వర్షం కురిపించారు. ఇలాంటి యువకుల తోటే గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతాయి అన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఉన్న అధికార పార్టీ సర్పంచులు ఈ స్థాయిలో అభివృద్ధి చేశారో వారు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తుందన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రాన్ని మరింత ఆదర్శంగా అభివృద్ధి చేసి చూపిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, జడ్పిటిసి కక్కెర్ల రాధిక, డాక్టర్ పెరుమల్ల రామకృష్ణ, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కమలాపురం రమేష్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్లు కాడబోయిన రవి యాదవ్, సదయ్య, రేవూరి జయపాల్ రెడ్డి, మత్స్య శాఖ చైర్మన్ బయ్యా తిరుపతి, కాంగ్రెస్ నాయకులు బరుపట్ల కిరీటి, వెల్ద వెంకటేశ్వర్లు, గుండెబోయిన శ్యామ్, మండల యూత్ అధ్యక్షులు తనువుల సందీప్ పాల్గొన్నారు.



పదవికి వీడ్కోలులో సర్పంచ్ భావోద్వేగం

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్



సర్పంచ్ పదవికి వీడ్కోలు చెపుతూ తాటికొండ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్ రెడ్డి ఎమోషనల్ అయ్యారు. మంగళవారం మండలంలోని తాటికొండ గ్రామంలో సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో గ్రామ పారిశుద్ధ్య కార్మికులు, ఇతర శాఖల సిబ్బందితో ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి చల్లా సుధీర్ రెడ్డి దంపతులు మాట్లాడుతూ తాము గ్రామ ప్రజల శ్రేయస్సే ముఖ్యంగా గ్రామానికి అనేక సేవలు అందించామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారం ఎన్నడూ మరువలేనిదని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు తన శక్తివంచన లేకుండా పనిచేశానని, గ్రామ ప్రజల సహకారం గొప్పదని వర్ణించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్యకు సన్మానం

నవతెలంగాణ-లింగాలఘనపురం



చిందు యక్షగాన కళ కోవిదుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను వారి స్వగృహంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జనగామ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను కలిసి సన్మానించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జనగామ జిల్లా అధ్యక్షులు గట్టగల్ల సంజీవ, తెలంగాణ సాంస్కృత సారధి, జనగామ జిల్లా టీం లీడర్ గణేష్, పిన్నింటి రత్నం, జనగామ శంకర్, కామెడీ కనకరాజు, పన్నీరు శ్రీనివాస్, కారుపోతుల సోమయ్య, కళాకారులు పాల్గొన్నారు.



మెస్ ఛార్జీలు, స్కాలర్ షిప్స్ చెల్లించాలి

- ఎస్ఎఫ్ఐ కలెక్టరేట్ ముట్టడి

నవతెలంగాణ-జనగామ

పెండింగ్ మెస్ ఛార్జీలు, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోజిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మ బిక్షం పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సరం కాలంగా వసతి గృహాలు, గురుకులాలు, కెజిబివిలు, ఆశ్రమ పాఠశాలు సంబంధించిన మెస్ బిల్లులు సమారు 6,300 కోట్లు పెండింగులో ఉన్నాయని తెలిపారు. విద్యారంగ సమస్యలకు ఈ ప్రభుత్వం పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ శివలింగయ్యకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న నాయక్, జిల్లా నాయకులు రాజు, వం , మోహన్, సాత్విక, విష్ణవి, రవళి, ప్రియాంక పాల్గొన్నారు



సేవాలాల్ జయంతి అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-పాలకుర్తి

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఫిబ్రవరి 15న అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు లావుడియా భాస్కర్ నాయక్ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిని కోరారు. మంగళవారం కాంగ్రెస్ కొడకండ్ల మండలాధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు రాజేష్ నాయక్‌లతో కలిసి గిరిజన నాయకులతో కలిసి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం గిరిజనులను మోసం చేశారని తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం నిధులు సేకరించారు తప్ప నిర్మాణ పనులను ప్రారంభించలేదని వివరించారు. ఆలయ నిర్మాణం కోసం నిధులు కేటాయించి యువత ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఆలయ నిర్మాణ ప్రదేశంలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రవినాయక్, పెద్దవంగర ఎస్టీ సెల్ అధ్యక్షులు సీతారాం నాయక్, దేవరుప్పుల ఎస్టీ సెల్ అధ్యక్షులు సజ్జన్ నాయక్, పాలకుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామ్ నాయక్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, సురేష్, మాజీ సర్పంచ్ కిషన్, ఉపసర్పంచ్‌లు మహేందర్, హరి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.




జీఎంపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-దేవరుప్పుల

మండలం కేంద్రంలో గొర్లు, మేకల పెంపకం దారుల మండలాధ్యక్షుడు భూమండ్ల కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన క్యాలెండరును ఎస్సై శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది క్రిష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తోటకూరి పాండు కృష్ణ, సుడిగాలహనుమంతు, మరాటి మల్లేష్, తోటకూరి కృష్ణయ్య, దావెర అనిల్, దూదిమేట్ల సోమలింగం, జక్కుల గంగరాజు, కుమార్, ఉప సర్పంచ్, మరాటి కృష్ణ,దూడల రాజు, కాసాని రాజు, ఎల్లబోయిన భిక్షపతి, నవీన్, మరసాని శ్రీను, కాసాని బుచ్చయ్య, మరాటి మల్లేష్, మరాటి క్రిష్ణ,ఎల్లబోయిన నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-బచ్చన్నపేట



ఎస్సీ, ఎస్టీ హక్కుల పై అవగాహన సదస్సును బేడ బుడగ జంగాల కాలనీలో బచ్చన్నపేట మండల తాహసిల్దార్ విశాలాక్షి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ విశాలాక్షి బేడ బుడగ జంగాల కాలనీలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి వివరించారు. మీకు స్థానికంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా మా దృష్టికి తీసుకురావాలని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వాలు అణగారిన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని వినియోగించుకోవాలని, తమ వంతు పూర్తి సహాయ సహకారాలు వారికిఉంటాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిటి కాసీం, ఆర్ఐ శ్రీనివాస్, సర్పంచ్ పర్వతం మధు ప్రసాద్, కార్యదర్శి కవిత, అంగన్వాడి టీచర్లు, బేడ బుడగ జంగాల నాయకులు సిరిపాటి రామదాసు, చింతల వెంకటయ్య, సిరి, పాటీ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు సర్పంచుల బాధ్యతలు అప్పగించాలి

ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎడ్ల వెంకటస్వామి

నవతెలంగాణ-జఫర్‌గడ్

సర్పంచుల పదవీకాలంఈనెలతో ముగిస్తుండడంతోఎంపీటీసీలకు సర్పంచుల బాధ్యతలు ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎడ్ల వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్‌ల మాదిరిగా ప్రజలతో ఎన్నికైన ఎంపీటీసీలకు బాధ్యతలు అప్పగిస్తే గ్రామాలఅభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు ఎంపీటీసీలకు చిల్లి గవ్వ నిధులు ఇవ్వలేదని ఉత్సాహ విగ్రహాలుగా మిగిలిపోయామని ఆరోపించారు. ప్రజలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చి గెలిపిస్తే నిధులు విధులు లేక క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నామని, ఎంపీటీసీలను చిన్న చూపు చూడటం తగదని సర్పంచ్‌ల స్థానంలో అధికారులకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించద్దని ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు చిలువేరు శివయ్య, ఎంపీటీసీ-1 జ్యోతి రజిత యాకయ్య, ఎంపీటీసీ-2 ఇల్లందుల స్రవంతి మొగిలి, ఎంపీటీసీ గోనే సంధ్య రాజేష్, ఎంపీటీసీ నీలమ్మ సోమిరెడ్డి, ఎంపీటీసీ బాదావత్ దేవేందర్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాత జీవోతో కొత్త రగడ..!

- మీడియా అనుమతి పై మున్సిపల్ కౌన్సిల్లో రచ్చ
- కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన
- మీడియాను అనుమతించేలా తీర్మానం చేద్దాం..?

నవతెలంగాణ-జనగామ

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మీడియాకు అనుమతులేదని ఇచ్చిన పాత జీవో కౌన్సిల్ సమావేశంలో రగడకు దారితీసింది.మంగళవారం జనగామ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక కౌన్సిల్ సమావేశం హాల్లో చైర్పర్సన్ పోకల జమున అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశానికి గౌరవ అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.అప్పటికి సమావేశం హాల్లో కూర్చున్న మీడియా మిత్రులను చూసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మీడియాకు అనుమతి ఉందా..? అని ఇంచార్జి కమిషనర్‌తో అడిగారు. దీంతో ఇన్చార్జి కమిషనర్ మేనేజర్ రాములను పిలిచి రిక్వెస్ట్ చేసి బయటకు పంపించాలని చెప్పారు. దీంతో మున్సిపల్ మేనేజర్ రిక్వెస్ట్ చేసి చెప్పగానే మీడియా మిత్రులు హాల్ నుండి బయటకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ లీడర్ వంగాల మల్లారెడ్డి మీడియా మిత్రులకు ఎందుకు అనుమతి ఉండదని, ఎమ్మెల్యేకు సంబంధించిన వ్యక్తిగత మనుషులు నలుగురు ఎలా ఉంటారని సమావేశ హాల్లోకి వచ్చారు. మీడియా మిత్రులను ఎందుకు సమావేశహాల్లోకి అనుమతించరని ప్రశ్నించారు. పాత జీవో ప్రకారం అనుమతి లేదని కమిషనర్ చెప్పారు. నియంతృత్వానికి పరాకాష్టగా ప్రజలు టిఆర్ఎస్ పార్టీని గద్దె దింపి ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చిందన్నారు. నియంతృత్వంగా వ్యవహరించడం సరైనది కాదని గట్టిగా మాట్లాడారు. కొత్తగా జీవో ఏమైనా ఉంటే తీసుకురండి అనుమతి ఇస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎదురుగానే కమిషనర్ అన్నారు.దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు టిఆర్ఎస్ కౌన్సిలర్ల వద్ద వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి అంతా చూస్తూ కూర్చున్నారు.నోరువిప్పి ఏం మాట్లాడకపోవడంతో పలువురుని విస్మయానికి గురిచేసింది. సమావేశం మధ్యలోనే కాంగ్రెస్ కౌన్సిలర్లు బహిష్కరించి బయటికి వచ్చారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిలర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, కాంగ్రెస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కౌన్సిలర్ జక్కుల అనిత మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని సహించలేకనే ప్రజలుకాంగ్రెస్‌కు పట్టంకట్టారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగతి భవన్ కంచలోను తొలగించి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న సంగతి తెలుసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే పాత జీవోలను కాంగ్రెస్ ప్రభుత్వం బొంద పెట్టి ప్రజాపాలన కనుకూలంగా వ్యవహరిస్తుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు బంగాళా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏదీరహస్యంకాదని పారదర్శకంగా పాలనసాగుతుందన్నారు. ఈ విషయాన్ని అధికారులు తెలుసుకొని విధులు నిర్వహించాలన్నారు. నియంతృత్వ పాలనలోని పాత జీవోను పక్కనపెట్టి మీడియాను కౌన్సిల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన సమావేశంలో కౌన్సిలర్ పట్టణానికి సంబంధించిన పదిఅంశాలను చర్చించి ఎజెండా అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో అదన కలెక్టర్ పింకజ్, అధికారులు పాల్గొన్నారు.



మీడియాను అనుమతించేలా తీర్మానం చేద్దాం : ఎమ్మెల్యే పల్లా

ప్రజా సమస్యలను వివరించడానికి ఉపయోగపడే మీడియాను కౌన్సిల్లోకి అనుమతించేందుకు ఏకగ్రీవ తీర్మానం చేద్దామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మీడియా అనుమతి పై మంగళవారం జరిగిన జనగామ మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశంలో జరిగిన రగడ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న టిఆర్ఎస్‌కి మీడియా అవసరం ఎంత ఉందన్నారు. కౌన్సిల్ సమావేశానికి మీడియా రావడానికి అడ్డంకులను తొలగించేలా కౌన్సిల్ సర్వసభ్య సమావేశం తీర్మానం చేద్దామని చెప్పారు. ఈ దిశగా కౌన్సిలర్లు అధికారులు ఆలోచించాలని సూచించారు.



సర్పంచ్‌ల సేవలు చిరస్మరణీయం : ఎంపీపీ



నవతెలంగాణ-తరిగొప్పుల

సర్పంచుల పదవీకాలం ముగియనుడడంతో మండల పరిధిలోని అక్కరాజుపల్లి గ్రామంలో సర్పంచ్ అమీర్‌శెట్టి వీరేందర్ అధ్యక్షతన వీడ్కోలు సమావేశం మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ జొన్నగోని హరిత సుదర్శన్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ, వార్డ్ సభ్యులను, గ్రామపంచాయతీ సిబ్బందిని అంగన్వాడి ఆశా కార్యకర్తలను, సీఏలను, కార్యదర్శి, కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామపంచాయతీ సిబ్బందిని సర్పంచ్ వీరేందర్ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వార్డు సభ్యులు, ఎంపీపీ, గ్రామ సిబ్బంది సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్పంచ్ గత ఐదు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మాకు వెన్నంటి ఉండి గ్రామ అభివృద్ధిలో తోడ్పడిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా శిరసేవంచి నమస్కరిస్తున్నానని భావోద్వేగానికి గురయ్యారు. గడచిన ఐదు సంవత్సరాలలో ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని అమర్యాదగా ప్రవర్తిస్తే ఒక సోదరుడుగా మన్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అరుణ, కార్యదర్శి అమరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రాజు, రమేష్, జన్నమ్మ, యాదగిరి, లావణ్య, నవ్యరెయిన్ బో యూత్ అధ్యక్షుడు అంకం రాజు, అంగన్వాడి ఆశా కార్యకర్తలు రమా, రజిత, స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమిష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి చేశాం : ఎంపీపీ

రఘునాథపల్లి : మండల అభివృద్ధి కోసం అందరి సహకారంతో ఐదేళ్లలో అభివృద్ధి చేశామని, సహకరించిన ప్రతి ఒక్కరికి ఎంపిపి మేకల వరలక్ష్మి నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రఘునాథ్‌పల్లి మండల సర్వసభ సమావేశం ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో పలు సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని పలువురు విజ్ఞప్తి చేశారు. సర్పంచులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యుగంధర్, ఎంపీడీవో హుస్సేన్, ఎస్సై రఘుపతి, ఎంపీటీసీలు ఉషా రవి, కృష్ణా సోమనాథ్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు పోకల శివకుమార్ గుప్తా, ప్రజా ప్రతినిధులు పాల్గొనగా బీఆర్ఎస్ జెడ్పిటిసి బోల్లం మణికంఠ, ఎంపీటీసీలు, సర్పంచులు సభకు హాజరై సభను బహిష్కరించారు. సభలోకి రాకుండానే బయట ఉండి వెళ్లారు.



స్వాతంత్ర భారతంలో సర్పంచులు ఎక్కువ పని చేశారు : ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నర్మెట్ట

స్వాతంత్ర భారతంలో సర్పంచులు ఎక్కువ పని చేశారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్మెట్ట మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశన్ని ఎంపీపీ గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ఐదు సంవత్సరాల పూర్తి కావడంతో వారు చేసిన పనులకు హర్షం వ్యక్తం చేశారు. ఈ 5 సంవత్సరాల్లో గ్రామాలను స్వర్ణయుగంగా సర్పంచులు మార్చారని, వాళ్ళు ఇబ్బందులు పడుతూ అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధిచేశారని, పైసలు సందిచుకొలేదుగానీ పేరు సంపాదించారున్నారు. అనంతరం సర్పంచులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, జెడ్పీ కో ఆప్షన్ నెంబర్ ఎండి గౌస్, సర్పంచ్ ఫోరం మండలాధ్యక్షుడు శివరాజ్, సర్పంచులు ఆమడపు కమలాకర్ రెడ్డి, నీరిటి రాణి సుధాకర్, ముప్పిడి లక్ష్మీ విజయ ప్రతాప్, కిరణ్ నాయక్, వెంకటరమణారెడ్డి, శంకర్ నాయక్, ఎంపీటీసీలు, కళ్యాణ మురళి, ఎమ్మార్వో మైపాల్ రెడ్డి, ఎంపీడీవో ఖాజా, మోహన్ రెడ్డి, ఎంపీఓ అరవింద్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దాం



- సీఐటీయూ పట్టణ కాన్వీనర్ సుంచు విజేందర్
- వ్యకాసా జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్

నవతెలంగాణ-జనగామ

ఫిబ్రవరి 16న కేంద్ర బిజెపి కార్పొరేట్ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని సీఐటీయూ జనగామ పట్టణ కన్వీనర్ సుంచు విజేందర్ పిలుపునిచ్చారు.మంగళవారం సీఐటీయూ జనగామ పట్టణ కమిటీ సమావేశం బూడిద ప్రశాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి 16న కార్మిక సమ్మె అన్ని రంగాల కార్మికుల కలుపుకొని జయప్రదం చేయాలని, కార్మిక, ఉద్యోగ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలన్నీ పిలుపు నిచ్చాయని తెలిపారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఉండేలా చట్ట భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెంచి శ్రమ దోపిడిగురి చేస్తుందన్నారు. కోట్లాదిమంది కార్మికులకు వర్తించే ఎస్ఐపిఎఫ్ పెన్షన్ 10000 రూపాయలకు పెంపు సిపిఎఫ్ రద్దుచేసి పాత పెన్షన్ ఓపీఎస్ పునరుద్ధరణ బిజెపి ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దుచేసి తిరిగి యధావిధిగా పాత కార్మిక చట్టాలను పెరిగిన ధరలు కనుగుణంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు వడ్డేపల్లి బ్లెషింగ్, కచ్చగళ్ల వెంకటేష్, గంగరబోయిన మల్లేష్‌రాజ్, ఉపేందర్, మునీర్, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి రూరల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్ పిలుపు నిచ్చారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్మారక భవనంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ సంఘం ఉమ్మడిగా నిర్వహించిన కార్మిక కర్షక మండల సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమసత్యం, రైతు సంఘం మండల కార్యదర్శి పనికర రాజు అధ్యక్షత వహించగా రమేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక విధానాల అవలంభిస్తుందని. ప్రజలకు అవసరమైనటువంటి నిత్యవసర సరుకుల ధరలు పెంచి ప్రజలనుఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో దేశంలోని పెద్దపెద్ద కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. కార్మిక రంగాన్ని దెబ్బతీసి కార్మిక హక్కులను కాలరాస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నినిర్వేరం చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల సారయ్య, మూస్కు ఇంద్రారెడ్డి, శ్రీలత, ఒగ్గుల కొమురయ్య, పి.ఐలయ్య, కే.ప్రవీణ్, జి.సోమ నర్సయ్య, పి.శ్రీకాంత్, కే.దర్గయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉదిత్‌కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రానికి చెందిన వార్డుసభ్యురాలు ఎదునూరి రజిత- కృష్ణ దంపతుల కుమారుడు ఎదునూరి ఉదిత్ (15) వయస్సు మంగళవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఉదిత్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండలాధ్యక్షుడు రాజు, వీరయ్య, బీఆర్ఎస్ నాయకులు భాగ్యలక్ష్మి, యాదగిరి,లక్ష్మీనారాయణ, మల్లేశం, వెంకటేష్, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

వెంకట్‌కు శుభాకాంక్షలు తెలిపిన సందీప్

నవతెలంగాణ-జఫర్‌గడ్




ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ కాంగ్రెస్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని అతని నివాసంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు కలిసి శుభాకాంక్షలు చెప్పి శాలువతో సన్మానించారు. విద్యార్థులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల రజినీకాంత్, ఎడ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బోధనలే మార్గదర్శనీయం

- ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి


నవతెలంగాణ-జనగామ



గాంధీ మహాత్ముడి బోధనలే మార్గదర్శనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక గాంధీ చౌక్ వద్ద గాంధీ విగ్రహానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు మున్సిపల్ చైర్ పర్సన్ పి.జమున, వైస్ చైర్మన్ రాంప్రసాద్, నాయకులు ప్రేమ లతా రెడ్డి, బండ యాదగిరి రెడ్డి, బండ పద్మ శ్రీనివాస్, తిప్పారపు విజయ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

నవతెలంగాణ-లింగాలఘనపురం



ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గట్టగల్ల కొమురయ్య మధ్యాహ్నం ఆవులు, ఎద్దులను మేతకు తొలుకెళ్లారు. మేసుకుంటూ ట్రాన్స్ఫార్మర్స్ వద్దకు వెళ్ళి విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు తెలిపారు.



దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

నవతెలంగాణ-జనగామ

వికలాంగులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఉపకరణాలను పంపిణీ చేశారు. మంగళవారం మహిళ,శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనగామ నియోజకవర్గనికి సంబంధించిన ఆర్థిక పునరావస పథకం, సహాయ ఉపకరణాలను ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో దివ్యాంగులకు రెట్రో మోటర్ ఐజడ్ వెహికల్(4), బ్యాటరీ వీల్ చైర్(2), వినికిడి యంత్రాలు (2), ట్రై సైకిల్ (3), ఆర్థిక పునరావస పథకం కింద(6) చెక్స్ వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, జెడ్పీ చైర్పన్ గిరగాని భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి జట్టి జయంతి, సిడిపిఓ రమాదేవి, కౌన్సిలర్లు, జిల్లా దివ్యాంగుల కమిటీ మెంబర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కృష్ణమూర్తి

నవతెలంగాణ-పాలకుర్తి



తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యేక భూమిక పోషించిన ప్రొఫెసర్ కోదండ రాముకు ఎమ్మెల్సీగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించడంతో మంగళవారం పిసిసి మాజీ కార్యదర్శి, పాలకుర్తి మాజీ సర్పంచ్ గంగు కృష్ణమూర్తి హైదరాబాదులో గల కోదండరాం నివాసంలో పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో జేఏసీ చైర్మన్‌గా పనిచేసిన ఉద్యమకారునికి అరుదైన గౌరవం దక్కడం అభినందనీయమన్నారు. ఉద్యమకారులందరినీ గత పాలకులు, విస్మరించారని, అవమానాలు ఎదుర్కొన్న ఉద్యమకారులందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని తెలిపారు. కోదండరాంకు కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవం ఇవ్వడంతో తెలంగాణ ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగు ఫణీంద్ర కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వాస్విక్ ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బచ్చన్నపేట



వాస్విక్ ఫౌండేషన్ క్యాలెండర్‌ను సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం ఫౌండేషన్ సభ్యులు కలిసి కొన్ని అంశాలపై చర్చించారు. ఫౌండేషన్ చేస్తున్న సేవలను వివరించారు. సామాజిక హిత కార్యక్రమాలు ఎంతో గొప్పగా ఉన్నాయని సీఎం అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఇండోపాక్ యుద్ధ వీరులు చిలువెరు వెంకట అప్పారావు(ప్రభంజన్) పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
బుధవారం | జనవరి 31, 2024 | www.navatelangana.com

ఆర్టీసీ నూతన డీఎంగా విశ్వనాథ్

నవతెలంగాణ-తొర్రూరు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్టీసి డిపో నూతన మేనేజర్‌గా బి.విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారంతొర్రూరు ఆర్టీసి డిపోలో ఆర్టీసి కార్గో సిబ్బంది, డిఎం విశ్వనాథ్‌ను శాలువాతో సన్మానించి,మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ నేపథ్యంలో ఆర్టీసి లాజిస్టిక్ సమస్యల గురించి వివరించారు. వెంటనే డిఎం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ తిరుమల రావు,ఎస్టిఐ రజిత, సుపర్డెంట్ ఫైనాన్స్ మల్లయ్య, సీనియర్ ఏడిసి మల్లికార్జున్, లాజిస్టిక్ డిఎంఈ పిసి కుమార్, పిసిసి పోల్ రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్‌కు బలరాం నాయక్ దరఖాస్తు

నవతెలంగాణ-మహబూబాబాద్



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు టికెట్ తన కేటాయించాలని కోరుతూ మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాం నాయక దరఖాస్తు చేశారు.మంగళవారం మహబూబాబాద్‌లో తన దరఖాస్తు ఫారం జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్చంద్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీలో కష్టకాలం ఉన్నప్పుడు తాను అండగా ఉండి ప్రజల్లో పని చేశారన్నారు. తనకు టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సరస్వతి

నవతెలంగాణ-తొర్రూరు



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సరస్వతి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 10,11,15,16 వార్డులలో ఆయా వార్డులకు సంబంధించిన కౌన్సిలర్లతో కలిసి పారిశుద్ధ్య పనుల నిర్వహణ, మంచినీటి సమస్యపై వార్డులలో తిరుగుతూ వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులపై జవాన్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హరిపిరాల రోడ్‌లోని నల్లాల బావినీ పరిశీలించారు. త్వరలో అది అందుబాటులోకి తెచ్చే విధంగా పైప్లైన్ వేస్తామన్నారు. వేసవిలో మంచినీటి కొరత లేకుండా చేస్తామన్నారు. దీనికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుపుల శంకర్, కర్నె నాగజ్యోతి, దొంగరి రేవతి శంకర్, బిజ్జాల మాధవి అనిల్, జవాన్లు వెంకన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

- మండల నోడల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

నవతెలంగాణ-పెద్దవంగర



ప్రాథమిక పాఠశాల దశలోనే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని మండల నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుధారపు శ్రీనివాస్ అన్నారు. పెద్దవంగర కాంప్లెక్స్ పరిధిలోని పోచంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, శంకర్ తండా ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని పలు రిజిస్టర్‌లను, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులతోమాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, ప్రతి విద్యార్థికీ చదవడం, రాయడం, గుణితాలు, సృజనాత్మకత నేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎండీ యాకూబ్, దేవేందర్, మోతీరాం, వెంకన్న, సీఆర్పీ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం కార్మిక హక్కులకై పోరాటం

- మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య

నవతెలంగాణ-మరిపెడ



భవన నిర్మాణ కార్మికులు పనిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం,కార్మిక హక్కులకై పోరాటాన్ని కొనసాగిస్తామని తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య అన్నారు. మంగళవారం వరంగల్‌లో జరిగిన సీఐటీయూ రాష్ట్ర వర్క్‌షాప్‌లో ఉప్పలయ్య పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పోరాటాల నివేదికను వెల్లడించారు.గత అనేక ఏళ్ల నుండి భవన నిర్మాణ కార్మికులు పనిలో మగ్గుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో వారి కేటాయించిన నిధులను వారికే ఖర్చు పెట్టకుండా నిధులను దారి మళ్ళిస్తున్నట్లు ఆయన విమర్శించారు. మా నిధులు మాకే ఖర్చు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డులో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని కోరారు. కార్మికులుగా పనిచేసిన వారికి మాత్రమే లేబర్ కార్డు మంజూరు చేయాలని, కానీ అధికారులు మాత్రం అన్ అర్హులకు కార్డులు మంజూరు చేసి అసలైన కార్మికులకి అన్యాయం చేస్తున్నారని, సంక్షేమ బోర్డు నుంచి వచ్చే సౌకర్యాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వర్క్ షాప్‌కు తరలి వెళ్లిన వారిలో వలస కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొడ్డు వెంకన్న, సిఐటియు మండల కన్వీనర్ దుండీ వీరన్న, తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం : ఎంపీడీవో

నవతెలంగాణ-పెద్దవంగర



పెద్దవంగర మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సమావేశానికి మండలంలోని 20 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. మధ్యాహ్నం 1:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలన్నారు.

మంత్రులను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బయ్యారం



తెలంగాణ రాష్ట్ర వివిధ శాఖలకు సంబంధించిన మంత్రులను మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని పలు సమస్యల గురించి తెలియజేశారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మహబూబాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు భరత్ చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో రెవెన్యూ శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆర్ అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మండల కాంగ్రెస్ కమిటీ మండలంలోని పలు సమస్యలని, అభివృద్ధి కార్యక్రమాల కొరకు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మంత్రులు త్వరలోనే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకాలు రూపొందించుటకు సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



మండలంలోని గుర్తూరు గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవులు ముగియనుండడంతో మంగళవారం గ్రామంలోని సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోత్కూరి రవీంద్ర చారి, సాహితి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశామని గ్రామాభివృద్ధి కోసం సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మేరుగు మాధవి రమేష్ గౌడ్,ఉపసర్పంచ్ ఆవుల సుజాత రవి కుమార్, వార్డు సభ్యులు పెంట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, ఉమ్మగాని ఏల్లా గౌడ్, ఉమ్మ గాని మమత సంతోష్, గుద్దేటి లక్ష్మి వెంకన్న, మిట్ట శ్రీనివాస్, వెల్తురి ఉప్పలమ్మ, వెల్తూరి మౌనిక రమేష్, బొర్ర రమేష్ తోపాటు పంచాయతీ కార్యదర్శి నరేష్, కారోబార్ వేణు, సిబ్బంది యాక్రంబ్రం, యాదగిరి, మదార్, మైబల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న అథ్లెటిక్ పోటీలు

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 8 , అండర్ 10, అండర్ 12 మరియు అండర్ 14 బాల బాలికలకు వచ్చేనెల 2న మానుకోటలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి అయిన బాస నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వ్యాయము ఉపాధ్యాయులు తమ బాలబాలికలను వారి బర్త్ సర్టిఫికేట్‌తో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9052670288 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కుష్టు వ్యాధి నిర్మూలించడమే లక్ష్యంగా పని చేయాలి

- మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కమిషనర్ సరస్వతి

నవతెలంగాణ-తొర్రూరు





కుష్టు వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ సరస్వతి అన్నారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వలిత ఆధ్వర్యంలో జనవరి 30న జరుపుకునే కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కోవిడ్ ప్రధాన అంశంగా మారిందని, ప్రత్యేకంగా కుష్టివ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించారన్నారు. కుష్టి వ్యాధి పై శ్రద్ధ అవసరమని, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల ప్రజలు అంగవైకల్యానికి గురవుతున్నారని, కుష్టువ్యాధి వల్ల ముప్పులేదని, కానీ సామాజికంగా బహిష్కరణకు గురికావడం, వెలివేయడం దురదృష్టకరమని అన్నారు. నేటికీ కులవివక్ష కొనసాగడాన్ని తప్పుపట్టారు. ఇంకా చాలా దేశాల్లో చట్టాలు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులు విడాకులు తీసుకుంటున్నారని, ఈ వ్యాధి నుంచి నివారణ అవసరమని, జనజీవన స్రవంతిలో కలవకపోవడం వీరిపై ఇంకా నియంత్రణ కొనసాగడం బాధాకరమన్నారు. కుష్టు వ్యాధిని ప్రపంచవ్యాప్తంగా నిర్మూలించడానికి వ్యక్తుల మధ్య హద్దులు చెరిపేయాలని, దీనివల్ల కుష్టు వ్యాధి బారిన పడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలు, సామాజికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుష్టు నివారణకు తక్షణం గుర్తించడం సరైన చికిత్స మాత్రమే కాదని, సామాజిక మార్పు అవసరమన్నారు. కుష్టు వ్యాధి బారినపడ్డ వారిపట్ల, వారి కుటుంబం పట్ల వివక్ష చూపరాదని వారు గౌరవప్రదంగా జీవించే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనకల్, మున్సిపల్ ఏఈ రంజిత్, మేనేజర్ కట్టస్వామి, కౌన్సిలర్లు భూసాని రాము, గుగులోతు శంకరు,కొలుపుల శంకర్, కోఆప్షన్ సభ్యుడు జలీల్, నాయకులు జై సింగ్, బిజ్జాల అనిల్,పేర్ల జంపా, విజయ్ కుమార్, జయమని, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మరిపెడ : కుష్టు వ్యాధి నిర్మూల కోసం కృషి చేయాలని గిరిపురం గ్రామ సర్పంచ్ పెద్ద బోయిన జనార్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని గిరిపురం గ్రామంలో జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కుష్టి వ్యాధి రోగులు పూర్తిగా సామాజిక జీవితం గడపవచ్చు అని ఆయన తెలిపారు. బట్టి రోగాలను ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండిటి చికిత్స ఇచ్చినట్లయితే కుష్టి వ్యాధి అంగవైకల్యంకు దారి తీయదని పేర్కొన్నారు. చర్మంపై ఎలాంటి మచ్చలు ఉన్న దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాలలోని డాక్టర్లకు లేదా స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు చూపించాలని కోరారు. కుష్టి వ్యాధులను బాధితులకు స్థానిక ప్రభుత్వ దావఖానలో మందులు అందుబాటులో ఉంటాయని దానిని కుష్టి వ్యాధి ఉన్నా వారు సద్వినియోగ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఉప సర్పంచ్ భాషిపంగు సుమలత సురేష్, ఏఎస్ఎం జి. నాగమణి, ఆశ వర్కర్లు కవిత, వినోద, అంగన్వాడి టీచర్స్ రాధా, ఉమా, ఉపేంద్ర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



యువత ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి

- అర్బన్ అధ్యక్షుడు గణపురం అంజయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

విద్యావంతులు ఉద్యోగులైన యువత ఎమ్మెల్సీ ఓట్లకు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య పిలుపు నిచ్చారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నమోదు ప్రక్రియలో డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చంద్ర రెడ్డి, ఎమ్మెల్యే మురళి నాయక్ ఆదేశం ప్రకారం మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ దాసు రాజు అధ్యాపకులను కలిసి ఓటు నమోదు చేసుకొని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుటి సురేష్, జిల్లా అధ్యక్షులు రంశెట్టి వీరేందర్, స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్ పింద్రాల రాందాసు, బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి శాంతన్ రామరాజు, తెలంగాణ ఉద్యమ నాయకులు గాంధీ వీరన్న, యాకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మూడవ ప్రపంచ యుద్ధం వస్తే అది నీటి కోసమే

- హెచ్ఎం కళ్లెం వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్



ప్రపంచంలో మూడో ప్రపంచ యుద్ధం అంటూ వస్తే అది నీటి కోసమే జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు కళ్లెం వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమనగల్లో యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం పాఠశాల ఉపాధ్యాయులు బలాష్టి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళ్లెం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో ఉన్న మర్రి చెట్టును మదర్ ట్రీగా భావిస్తారని దానిపై అనేక రకాల జీవరాసులు నివసించడం వలన అవి విసర్జించినా మలం ద్వారా రకరకాల విత్తనాలు వెదజల్లబడి దాని కింద అనేక మొక్కలు మొలుస్తాయని అందుకోసమే మా పాఠశాలలో ఉన్న మర్రి చెట్టును మదర్ ట్రీగా భావించి దానికి పూజ చేశామన్నారు. నీటి సంరక్షణకు మన పరిసర ప్రాంతాలలో ఇంకుడు గుంటలు, చెక్ డ్యాములు, గట్లు నిర్మించి భూగర్భ జలా నీటిమట్టాన్ని పెంచాలని నీటిని ఆదా చేయకపోతే పంటల ఉత్పత్తికి, తాగునీటికి కొరత ఏర్పడి ప్రపంచ దేశాల మధ్య వైశాల్యాలు సృష్టించబడి నీటి కోసం కొట్లాటలు మొదలై అది మరో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేశబోయిన వెంకన్న, పి.జనార్ధన్, బాలాజీ, కారుపోతుల యుగంధర్ పాల్గొన్నారు.



ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-ఇనుగుర్తి

స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల యందు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జె.రూపారాణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవం పెంపొదిస్తాయన్నారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులుగా బి.పరమేష్, ఎంఈఓగా నద్దునూరి.సింధుజ డీఈవో వర్ధోలు లక్ష్మీ ప్రసన్న, డిఈఓ కొంతం సౌమ్యలు వ్యవహరించగా, దాదాపు 36 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా తమ బాధ్యతలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కోమ్మురాజేందర్, ఎ.యాకయ్య, కుమారస్వామి, కిషన్, దేవేందర్, సమ్మిరెడ్డి, ప్రవీణ్ కువ కార్ నారాయణ, యాదగిరి, శీరిషా, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, పండ్ల తోటల సాగులో మెళకువలు పాటించాలి : మండల ఉద్యాన అధికారి రాకేష్

నవతెలంగాణ-పెద్దవంగర

రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో సాగుచేస్తున్న కూరగాయలు, పండ్ల తోటల పెంపకంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు సూచించిన మెళకువలను పాటిస్తే అధిక దిగుబడి, లాభాలను సాధించవచ్చునని మండల ఇంచార్జి ఉద్యాన శాఖ అధికారి రాకేష్ అన్నారు. మంగళవారం రామచంద్రు తండాకు చెందిన రైతు జాటోత్ దామోదర్ నాయక్ సాగు చేస్తున్న కూరగాయల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగుకు రైతులు ఆసక్తి చూపాలన్నారు. కూరగాయలు సాగుతో నిత్యం ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆయా పంటల్లో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా 953 ఎకరాల్లో మామిడి సాగు, 168 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు, 143 ఎకరాల్లో ఇతర పండ్ల తోటల సాగు, 384 ఎకరాల్లో మిరప, 46 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని చెప్పారు. ఉద్యానవన పంటల సాగులో అధిక దిగుబడులను, లాభాలను ఏవిధంగా సాధించాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు జాటోత్ సునిత, యాకయ్య, నగేష్, కిష్టు తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీకి నివాళులు

నవతెలంగాణ-మహబూబాబాద్



స్వాతంత్ర్య సంగ్రామంలో భారతదేశం కోసం ప్రాణాలర్పించిన పూజ్యనీయులు బాపూజీ మహాత్మా గాంధీకి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం సమావేశం మందిరంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ అధికారులతో కలిసి 2 నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను ఫణంగాపెట్టి అమరులై త్యాగధనులుగా నిలిచారన్నారు. వారి త్యాగాలను స్మరిస్తూ భావి తరాలకు తెలియజేయడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సవ్, డేవిడ్, ఏఓ వెంకటరమణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తొర్రూరు : మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను మంగళవారం కాంగ్రెస్ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాశేఖర్‌లు మాట్లాడుతూ గాంధీజీ భారత స్వాతంత్ర్యానికి తన జీవితాన్నే అంకితం చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు భూసాని రాము, తూనం రోజా ప్రభుదాస్, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు బూర్గుల ప్రశాంతి, ఉపాధ్యక్షురాలు శీలం హరిత, యూత్ పట్టణ అధ్యక్షుడు బసన బోయిన మహేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ధరావత్ సోమన్న, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, తాళ్లపల్లి బిక్షం గౌడ్, దీకొండ శ్రీనివాస్ గౌడ్, నరేష్ రెడ్డి, సమ్మయ్య గౌడ్, అశోక్ రెడ్డి, శ్రీనివాస చారి, ప్రహ్లాద రావు, తూర్పాటి రాంబాబు, తాటికాయల రాణి, అనిత, అండాలు, నడిగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : మండల మహిళ అధ్యక్షురాలు తగిర నిర్మల రెడ్డి అధ్యక్షతన మంగళవారం మండలంలో జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ సీనియర్ నాయకులు తగిర సత్తిరెడ్డి మాట్లాడుతూ..అహింస పద్ధతిలో దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాను బావుడు మహాత్మ గాంధీ అని, ఆయన ఆశయ సాధాన కోసం అందరూ కలిసి పని చేయాలని మహాత్మా గాంధీ విగ్రహనికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోయగురి రామకృష్ణ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బండారు మల్లయ్య, వార్డు మెంబర్ ఏనుగుల కోటయ్య, పోతుగంటి సుమన్, కత్తి రాధ కృష్ణ, ఎర్ర నాగేశ్వర్ రావు, పసునూరి మల్లయ్య, రమేష్, బూడియా బాపు, వీరన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి : కలెక్టర్ అద్వైత్ కుమార్

నవతెలంగాణ-మహబూబాబాద్

పెండింగ్ దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను సంబంధిత రెవెన్యూ అధికారులతో కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6, 7, 8 ల క్రింద స్వీకరించిన దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ దరఖాస్తులన్నీ పూర్తి కావాలని స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. కేసముద్రం గూడూరు నెల్లికుదురు మహబూబాబాద్ లో ఎక్కువగా దరఖాస్తులు పెండింగ్ ఉన్నందున మహబూబాబాద్ ఆర్డీఓను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆన్లైన్ రిపోర్ట్స్ ఎప్పటికప్పుడు అందజేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఓటు హక్కు కొరకు చేసుకున్న దరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో ఆదరణ కలెక్టర్ డేవిడ్, ఎన్నికల విభాగం అధికారులు తాసిల్దార్ మాధవి సిబ్బంది రంజిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందుకునే స్టాఫ్ నర్స్‌లకు సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

స్టాఫ్‌నర్స్‌ల నియామకాల పత్రాలను అందుకునేందుకు వెళుతున్నఉద్యోగులకు భోజన,వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం స్టాఫ్ నర్స్‌లకు ఎస్టి, ఎస్‌సి, వసతి గృహాలలో భోజన వసతి రవాణా సౌకర్యాలపై కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 93 మంది స్టాఫ్ నర్సులు ఎంపికైనందున నియామక పత్రాలను అందుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి వస్తున్నందున వారికి కావలసిన భోజన వసతి రవాణా వంటి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బుధవారం ఉదయం హైదరాబాద్ వెళ్లేందుకు 50 సీట్ల సామర్థ్యం కలిగిన రెండు బస్సులను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్టాఫ్ నర్స్ నియామకాలకు ఎంపికైన ఉద్యోగులు నియామక పత్రాలు అందుకుంటున్న సందర్భంగా సంబంధిత ఉద్యోగులకు సౌకర్యాలు సమకూరుస్తున్నామన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సవ్, డేవిడ్, మహబూబాబాద్ ఆర్డిఓ అలివేలు, వైద్య శాఖ అధికారి అంబరీష, ఉద్యాన వన శాఖ అధికారి సూర్యనారాయణ, డిప్యూటీ సీఈఓ నర్మద కలెక్టరేట్ ఏవో వెంకటరమణ, డిడి సోషల్ వెల్ఫేర్ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షులుగా బత్తుల శ్రీనివాస్

నవతెలంగాణ-గూడూరు



టీఎస్ యూటీఎఫ్ గూడూరు మండలాధ్యక్షునిగా బత్తుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం గూడూరు మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఎన్నిక కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు ధనసరి రమేష్ ఎన్నికల అబ్జర్వర్‌గా పాల్గొన్నారు. మండలాధ్యక్షులుగా బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తేజవత్ రవీందర్, ఉపాధ్యక్షులుగా పిండి అనిల్ కుమార్, అజ్మీర వనజ, ఆర్థిక కార్యదర్శి దబ్బకట్ల రమేష్, కార్యదర్శులు దేవేందర్, రాజు, శ్రీలత సాధికాసుల్తానా, ఆడిట్ కమిటీ కన్వీనర్ స్వామినాథన్, భాగ్యలక్ష్మి, సాంస్కృతిక కార్యదర్శి ఆలూరి విలియంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు.

కాశ్య తండా జీపీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-నెల్లికుదురు



మండలంలోని కాశ్యతండా గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు శాలువాతో సత్కరించినట్లు పంచాయతీ కార్యదర్శి చందన, సర్పంచ్ బుజ్జి వెంకన్న తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా సర్పంచ్ బుజ్జి వెంకన్న మాట్లాడుతూ ఈ గ్రామ ప్రజలు నన్ను గె లిపించి అభివృద్ధి పరిచేందుకు పట్టం కట్టినందుకు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు.అభివృద్ధికి నాతోటి పాలకవర్గ సభ్యులు ప్రజలు సహకరించి నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరన్న, వార్డు సభ్యులు భీమా గంగా, సత్మా, రజిత, రాజమ్మ, దేవల జ్యోతి, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి

- డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్

నవతెలంగాణ-చిన్నగూడూరు



పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో అయనమాట్లాడారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో నవంబర్ 1 2020 నాటికి డిగ్రీ పూర్తి అయిన పట్టభద్రులు తమ ఓటును తప్పక నమోదు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

బొమ్మాపూర్ గ్రామంలో పోలీసుల కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండల పరిధి బొమ్మపూర్ గ్రామంలో ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో మంళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామస్తులతో సమావేశమై ఆయన మాట్లాడారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని, లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశామన్నారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీ సులకు సమాచారం అందించాలని సూచించారు. నిషేధిత గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని తెలిపారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు కిషన్, విక్రాంత్, అరుణ్, అనంత్ సిఆర్పిఎఫ్ సిబ్బంది, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నారాయణ హై స్కూల్‌లో అమరవీరుల దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హై స్కూల్‌లో మంగళవారం అమరవీరుల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జాతీయ నాయకుల ఆత్మకు శాంతి కలగాలని అమరవీరుల దినోత్సవ ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అనిశెట్టి భానుచందర్, ప్రిన్సిపాల్ ఎ స్రవంతి, డైరెక్టర్ ఎన్ రవి, ఉపాధ్యాయులు రాజేష్, స్వామి, రఘు, పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

- అదనపు కలెక్టర్ కె వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భూపాలపల్లి

మాదకద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ కార్యచరణ రూపొందించి అమలు చేయాలని అదనపు కలెక్టర్ కె వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలన అంశంపై మంగళవారం సంబంధిత అధికారులతో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో డ్రగ్స్ వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మాదక ద్రవ్యాలు వ్యసనం ఉన్న వారిని గుర్తించాలని సూచించారు. మాదక ద్రవ్యాలైన గంజాయి వాడేవారు ప్రతి గ్రామంలో ఉన్నారని, వారి ద్వారా సరఫరా చేసే వారిని గుర్తించి కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఎక్సైజ్ పోలీస్ శాఖలు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థల పరిసరాల్లో గల దుఖనాల్లో తనిఖీలు నిర్వహించాలని, ఉపాధ్యాయుల ద్వారా మాదకద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాల పై అవగాహన కల్పించాలని అన్నారు. మాదక ద్రవ్యాలు వాడే విద్యార్థులను గుర్తించి వారికి, వారి తల్లదండ్రులకు కౌన్సెలింగ్ అందజేయాలని అన్నారు. అదనపు ఎస్పీ ఏ.నరేష్ కుమార్ మాట్లాడుతూ ఈ మాసంలో 5 గంజాయి కేసులు బుక్ చేసి 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని 9 మంది నిందితులను అరెస్ట్ చేశామని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ లను ఏర్పాటు చేయాలని ఇప్పటి వరకు 25 కళాశాలలో కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా లో గంజాయి హాట్ స్పాట్ లను గుర్తించాలని, గంజాయి వాడుతున్నవారి, సరఫరా చేస్తున్న వారి సమాచారాన్ని ప్రజలు సైతం సమీప పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు అందజేయాలని కోరారు. జిల్లాలో ఎక్సైజ్, పోలీసు శాఖ సమన్వయంతో సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ వి శ్రీధర్, డీఏఓ విజయ భాస్కర్, అటవీ, ఎక్సైజ్, విద్యా, పోలీస్‌శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి : అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భూపాలపల్లి

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో సెక్టోరియల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అదుపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 108 అసెంబ్లీ సెగ్మెంట్ కు చెందిన సెక్టోరియల్ అధికారులతో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల పై సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఏప్రిల్ లో కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుందని, సెక్టోరియల్ అధికారులు వారి వారి రూట్ల ను పరిశీలించుకోవాలని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో భూపాలపల్లి నియోజకవర్గంలో 29 సెక్టార్లలో 32 మంది సెక్టోరియల్ అధికారులు 317 పోలింగ్ కేంద్రాల ద్వారా పోలింగ్ నిర్వహించామని, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. వారి వారి సెక్టార్లలోని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలను సమన్వయపరచుకుంటూ పార్లమెంటు ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఈవీఎంల పనితీరు, ఫారం 17 సిలను పరిశీలించాలని తెలిపారు. అధునాతన టెక్నాలజీ గల ఎం 3 ఈవీఎం మిషన్ల ద్వారా పోలింగ్ నిర్వహిస్తామని, ప్రతి పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి అవ్వడానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రమాదేవి, సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి సందాని

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సందాని అన్నారు. మంగళవారంజాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ వారి సౌజన్యంతో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో భూపాలపల్లి లారీ డ్రైవర్ అసోసియేషన్,చెల్పూర్,గొర్లవేడు ఆటో యూనియన్ కు సంబంధించిన డ్రైవర్లు ఇతర సిబ్బంది సుమారు 50 మంది వరకు పాల్గొని రక్తదానం చేశారని తెలిపారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమా లను పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలనిసూచించారు.



కుష్టు నిర్మూళన పట్ల అవగాహన

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీఎస్ కాళేశ్వరం పాఠశాలలో మంగళవారం జాతీయ కష్టు వ్యాది నిర్మూళన కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి రహిత దేశ నిర్మాణం కోసం కృషి చేస్తాంని ప్రతిజ్ఞ చేయించారు. కుష్టు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుస్మిత, లెప్రసీ నోడల్ పర్సన్ అడప రాజరమణయ్య ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్,స్టాఫ్ నర్స్ కీర్తి, ఫార్మసిస్ట్ మోనిక, డీఈఓ వెంకటేష్, ఆశలు శ్రీలత, సుశీల, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమగ్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-భూపాలపల్లి

సమన్వయంతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని జిల్లా, నియోజకవర్గ అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సంఘాల సమావేశానికి జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా వ్యవసాయశాఖతో పాటు అనుబంధశాఖలైనా హార్టికల్చర్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వ్యవసాయంలో మార్పులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని, వ్యవసానుబంధ శాఖల అధికారులు ప్రజలుకు అందుబాటులో ఉంటూ.. సూచనలు సలహాలిస్తూ.. పాడిపంటలను పెంపొందించి గ్రామాలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటింటికి గేదెలు, ఆవులు, మేకలు, పశువులు, కనీసం ఇంటి అవసరాల మేరకు పెంచే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వాటి రోగాలు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్స్యశాఖ అధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అధికారులనడిగి తెలుసుకున్నారు. 100 పడుకల ఆసుపత్రిలో, మెడికల్ కళాశాలలో ఫెండింగ్ పనులు క్షుణ్ణంగా అధికారులనడిగి తెలుసుకున్నారు. 100 పడుకల ఆసుపత్రిలో, మెడికల్ కళాశాలలో



ఫెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడి మెడికల్ కళాశాలలో సింగరేణి విద్యార్థులకు" రామగుండంల రిజీయన్‌లో ఇచ్చిన విధంగా నిధులు ఇవ్వాలని, సింగరేణి కార్మికుల పిల్లలకు అవకాశం కల్పించాలని సింగరేణి సీఎండీని కోరినట్లు తెలిపారు. 100 పడకల ఆసుపత్రిలో ఎంఆర్ఎ సిటీ స్కాన్, రక్త కణాల మిషన్లను ఏర్పాటు చేసి భూపాలపల్లి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేసే విధంగా చూస్తామన్నారు. ఈసందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్యనారాయణరావును సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈవో విజయలక్ష్మి జడ్పీ వైస్ చైర్మన్ కళ్లెపు శోభ, జెడ్పీటీసీలు, అధికారులు విజయభాస్కర్, సంజీవరావు, శ్రీదేవి, అవినాష్, జెడ్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జంతు సంక్షేమం ప్రతి పౌరుడి బాధ్యత

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిడాక్టర్ శ్రీదేవి

నవతెలంగాణ-భూపాలపల్లి



జంతు సంక్షేమం ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీదేవి అన్నారు. మంగళవారం జంతు సంరక్షణ వారోత్సవాల లో భాగంగా భూపాలపల్లి మండలంలోని జంగేడు పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వీధులలో తిరిగే కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతువుల పట్ల కరుణతో వ్యవహరించాలన్నారు. ఆహారం తాగునీరు అందించాలని సూచించారు. పక్షులు నివసించే ఆవాసాలైన వృక్షాలను తొలగించరాదన్నారు. అవి నివసించే ప్రాంతాలలో గాలిపటాలు ఎగురవేయడం సరికాదన్నారు. వాటికి ఉన్న దారాలు (మాంజా) వల్ల అనేక పక్షులు మత్యువాత పడుతున్నాయని తెలిపారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఎట్టి పరిస్థితులలోను వాటిని నిర్ధయగా బయట వదిలి పెట్టరాదు అన్నారు. వీధి కుక్కలను చంపుట, వేరే ప్రాంతాలకు తరలించుట, హింసించుట చట్టరీత్యా నేరమని తెలిపారు. జంతు సంరక్షణ కొరకు సేవచేయువారికి, స్వచ్ఛంద సంస్థలకు ప్రతి పౌరుడు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

నవతెలంగాణ-రేగొండ



రేగొండ మండల కేంద్రంతో పాటు రంగయ్య పల్లి పశు వైద్యశాల పరిధి గ్రామాల్లో ఉన్న పెంపుడు కుక్కలకు మంగళవారం జంతు వారోత్సవాలలో భాగంగా ఉచిత యాంటీ రేబిస్ టీకాలను వేసినట్లు రేగొండ రంగయ్యపల్లి పశు వైద్య అధికారులు, మైథిలి, శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. ఇలాంటి యాంటీ రేబిస్ టీకాలు వేయడం వల్ల పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి బారిన పడకుండా ఉంటాయని వారు తెలిపారు. పెంపుడు కుక్కలకు ప్రతి ఒక్కరూ యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని సూచించారు.



మహదేవపూర్ : మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పశు వైద్యశాలలో మంగళవారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్టు డాక్టర్ మల్లేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పెంపుడు కుక్కలకు టీకాలు వేసారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్థంతి

నవతెలంగాణ-మల్హర్‌రావు



మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రమైన తాడి చెర్లలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా మండల పరిషత్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంపిపి చింతలపల్లి మల్హర్ రావు, ఎంపిడిఓ నరసింహమూర్తి,వైశ్య సంఘం నాయకులు కుక్కడపు వెంకటేశ్వర్లు, కోడీమ్యాల భాస్కర్,ఓల్లాల రమేష్,ప్రసాద్,నాగరాజు,యంసాని రాజు పాల్గొన్నారు.

మహాముత్తారం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు మహత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పంచాయతీ అధికారి యం శ్రీనివాస్ రావు, ఏఈ పిఆర్ యం రమేష్ బాబు, పర్యవేక్షకులు పి రమేష్ బాబు, కోర్లకుంట సర్పంచ్ నవీన్ కుమార్ పంచాయతీ కార్యదర్శులు వేణు,శివశంకర్, ఐకేపి సిబ్బంది కార్యాలయ సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్లు, ఈజియస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



'విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి'

నవతెలంగాణ-ఏటూర్ నాగారం ఐటీడీఏ

అనుకోని పరిస్థితులలో విపత్తులు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో ధైర్యంగా ఎదుర్కోవాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో స్థానిక తహశీల్దార్ ఖాజామొహినొద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళ్లకు కట్టినట్లుగా వారికి వివరించారు. వరదలో చిక్కుకున్న వారిని రబ్బర్ బోటు సాయం, బేలూన్స్, టైర్ ట్యూబ్‌ల ద్వారా కాపాడే విధానాన్ని వివరించారు. బాంబులు, అగ్ని ప్రమాదాలు వచ్చినప్పుడు మనల్ని మనం కాపాడుకుంటూ ఇతరులకు ఎలాంటి సాయం అందించాలని విద్యార్థులకు వెల్లడించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు తోటి వారికి సాయం చేయాలనే దృక్పథంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రమాదాలు వచ్చినప్పుడు 100 కాల్ చేసి, ఏదైనా పోలీసులు, రెవెన్యూ వారికి సమాచారం ఇచ్చి సాయం పొందాలన్నారు. యువత సన్మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ రాజేశ్వర్‌రావు, ఆర్ఐ బండారపు శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ గంపల శంకర్, రికార్డు అసిస్టెంట్ బత్తుల కష్ణ, గంగాధర్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు సుభాష్, రవి పాల్గొన్నారు.

పిల్లల చదువులపై దృష్టి సారించాలి

- ప్రధానోపాధ్యాయులు కల్తీ శ్రీనివాస్

నవతెలంగాణ-గోవిందరావుపేట



పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు కల్తీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కర్లపల్లి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. పేరెంట్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి 10/10 రిజల్ట్ పై విద్యార్థుల తల్లిదండ్రులతో కర్లపల్లి ఉపాధ్యాయులు చర్చించారు. మంచి మార్కులు రావాలంటే ఉత్తమ మైన క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం అని, రాష్ట్రప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులకోసం ఎంతో వినూత్న కార్యక్ర మాలు చేస్తుందని అన్నారు. 100 రోజుల ప్రోగ్రాం విద్యార్థులకు ఎంతో ఉప యోగపడుతుందని అన్నారు. ప్రతి రోజు అదనపు క్లాసులు నిర్వహిస్తున్నామని వినియోగించుకోవాలని తెలిపారు. 10వ తరగతి క్లాస్ ఫస్ట్ వచ్చిన పూర్వ విద్యార్థి రాములుకు రూ.5వేలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ ఆధ్వర్యంలో అందజేశారు.

అనుచరణీయం మహాత్ముని మార్గం: కోడెల నరేష్

నవతెలంగాణ-మంగపేట



జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన శాంతి అహింసల మార్గం యువతకు అనుచరణీయ మని జ్వాలా యూత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జ్వాలా ట్రస్ట్ కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ పాత్ర మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మునిగాల రాకేష్, కార్యదర్శి ఆత్మకురి సతీశ్, కార్యవర్గ సభ్యులు లిక్కి రమేష్,అక్కినపల్లి నరేష్, మహ్మద్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

లక్ష్మినసింహ స్వామి జాతర వేలం

నవతెలంగాణ-రేగొండ

మండలంలోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర-2024, బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో వేలం నిర్వహించారు. జాతరలలో పుట్నాలు, పేలాలు అమ్ముకునే హక్కు హెచ్చు పాట రూ. 6500, నూనె గురుగులు అమ్ముకునే హక్కు హెచ్చు పాట రూ. 23,000, జాతర తదుపరి 11 నెలలకు గాను వేలములు నిర్వహించగా కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్ముకును హక్కు హెచ్చు పాట రూ. 9,23,000, కొబ్బరిముక్కలు పోగు చేసుకునే హక్కు రూ.1,25,000, మాణిహారం(బొమ్మలు)



అమ్ముకునే హక్కు హెచ్చు పాట రూ.1,52,000గా, స్వీటు అమ్ముకునే హక్కు రూ. 85,000, పూల దండాలు రూ.81,000 హెచ్చు పాటగా వచ్చాయి. మొత్తంగా వేలం ద్వారా రూ.13లక్షల95,500 వచ్చినట్లు ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. కాగా జాతర సందర్భంగా కొబ్బరికాయలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు, పూలదండలు అమ్ముకునేందుకు సరైన వేలం రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ వేలంలో దేవాదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ఆలయ చైర్మన్ మాదాడి అనిత కరుణాకర్ రెడ్డి, ధర్మకర్తలు కనుకుంట్ల దేవేందర్, పోగు సుమన్, కోళ్ల భద్రయ్య, గ్రామ పెద్దలు ముల్కనూరి బిక్షపతి, కొలుగురి సంపత్ రావు, పబ్బు సమయ్య, ఇజ్జిగిరి సాంబశివరావు టెండర్ దారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కుష్టు పట్ల అవగాహన కలిగి ఉండాలి

- డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య

నవతెలంగాణ - ములుగు

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టుపై అవగాహన కల్పించడానికి స్పర్శ లెప్రసీ అవగాహన ఉద్యమంలో భాగంగా స్థానిక జిల్లా ఆసుపత్రి ములుగు నుండి ర్యాలీ ప్రారంభించారు. డీఎంహెచ్ఓ అప్పయ్య జండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కుష్టు నిర్మూళనకు ఆరోగ్య శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన చికిత్స అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా లభిస్తుందని అన్నారు. కుష్టు లక్షణాలుంటే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యున్ని సంప్రదించాలని, వారు పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తారని తెలిపారు. కుష్టుకు సమయానుకూలంగా చికిత్స తీసుకుంటే నయమవుతుందని తెలిపారు. కుష్టు బాధితుల పట్ల వివక్ష చూపకూడదని, వారిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డీపీఎంఓ సాంబయ్య, జయరాజ్, డెమో తిరుపతయ్య, హెచ్ఈ భాస్కర్, సిహెచ్ఓ శకుంతల, శారద, పల్లె దావకాన వైద్యాధికారులు, సూపర్వైజర్ సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు రాయనిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి : డాక్టర్ యమున

నవతెలంగాణ-మంగపేట



కుష్టు నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు చిన్నపాక యమున పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు యమున మాట్లా డారు. కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం జనవరి 30వ తేది నుండి ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ 15 రోజులలో ప్రజలకు కుష్టు వ్యాధిపై సమగ్ర అవగాహన కలిగించడంతో పాటు అపోహలను తొలగించడం జరుగుతుందని వెల్లడించారు. కుష్టు వ్యాధి రహిత దేశ నిర్మాణం జరగాలని అందరు భాగస్వామ్యం కావాలని కోరారు. వైద్యులు వేణు,శైలజ,పి హెచన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ బారికేడ్లు బహుకరణ

నవతెలంగాణ - ములుగు



రానున్న మేడారం జాతర సందర్భంగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి డాక్టర్ శభరీష్‌కు రూ.లక్ష50వేల విలువ గల ఇనుప బారికేడ్లను సంస్థ సీనియర్ జోనల్ మేనేజర్ సజన్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించుటకు ట్రాఫిక్ నిర్వహణ నిమిత్తం బారికేడ్లు అందించినందుకు కృతజ్ఞతలు తెలి యజేశారు. అనంతరం ఏటూర్‌నాగారం ఏఎస్పి సిరిశెట్టి సంకీర్త్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వారు కొంతమంది స్థానిక రైతులకు 10 ద్విచక్ర వాహన హెల్మెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పి రవీందర్ కోరమండల్ సీనియర్ జోనల్ మేనేజర్ సజన్ కుమార్, సీనియర్ అగ్రోనామిస్ట్ వినోద్, వెంకన్న అగ్రోనామిస్ట్ సుమన్‌రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ సిబి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సమ్మక్క- సారలమ్మ పూజారులు, వడ్డెలు కులస్తుల

సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- తాడ్వాయి



శ్రీ సమ్మక్క- సారలమ్మ పూజారులు వడ్డెలు కులస్తుల సంఘం 2024 క్యాలండర్ ను మంగళవారం ఐటిడిఏ పిఓ అంకిత్ చేతులమీదుగా, సమ్మక్క ప్రధాన పూజారి సిద్ధబోయిన సురేందర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూజార్ల సంఘం ప్రధాన పూజారి సిద్ధబోయిన సురేందర్ మాట్లాడుతూ మేడారం మహా జాతరలో కోటికి పైచిలుకు సందర్శకులు వస్తారని అన్నారు. మేడారం మహా జాతరకు వచ్చే ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. జంపన్న వాగులో గజ ఈతగాడ్లు గా గిరిజనులనే నియమించాలని ఐటిడిఏ పిఓ అంకితను కోరారు. గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి అన్నారు. వందకు వందశాతం ఆదివాసి గిరిజనులనే జంపన్న వాగు వద్ద గజ ఈతగాళ్ళుగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుపాకుల తుపాకులగూడెం మత్స్యకారుల సంఘం అధ్యక్షులు ఆలం భాస్కర్, పాలెం గిరిజన మత్స్యకారుల సంఘం అధ్యక్షులు సోలం ఆదినారాయణ, ఆశన్నగూడ ఎల్లాపూర్ గిరిజన మత్స్యకారుల సంఘం అధ్యక్షులు వట్టం విశ్వనాథం, గోవిందరావుపేట మండలం సంఘం అధ్యక్షులు రేగ కృష్ణారావు, వివిధ మత్స్యకారుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు సిద్ధం కావాలి

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురుకుట్ల నరేందర్

నవతెలంగాణ-మంగపేట



విద్యావంతులు ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకుని ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని యూత్ కాంగ్రెస్ మురుకుట్ల నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్ ల ఆదేశాల మేరకు ఈ సమా వేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2020 నవంబర్ లోపు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఫిబ్రవరి 6వ తేదీలోపు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ మెమో, ఓటర్ కార్డు, పాస్ ఫోటో, ఆధార్ కార్డులతో సంబం ధిత అధికారులను గానీ దగ్గరలోని ఆన్లైన్ సెంటర్ ను గానీ సంప్రదించి ఓటర్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి బాడీశ ఆదినారాయణ, గౌరవ అధ్యక్షులు భాను చందర్,ఉపాధ్యక్షులు కుర్సం రమేష్,యూత్ నాయకులు కారుపోతుల నర్సయ్య గౌడ్, ఎడ్ల నరేష్, గుగ్గిల్ల సురేష్, మద్దెల ప్రవీణ్, చంటి, నరేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 6
జయశంకర్ ములుగు - భూపాలపల్లి
బుధవారం | జనవరి 31, 2024 | www.navatelangana.com

నేటి వరకే సీసీఐ అధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి సుచిత్ర



నవతెలంగాణ - ములుగు

పత్తి రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటి ములుగు పరిధిలో గల 3 జిన్నింగ్ మిల్లులలో సీసీఐ ద్వారా ఈనెల 31 (బుధవారం) వరకు మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తామని ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సుచిత్ర మంగళవారం తెలిపారు. పత్తి రైతులు ఈనెల 31 వరకు ములుగు పరిధిలోని 3 జిన్నింగ్ మిల్లుల యందు తమ పత్తి పంటను అమ్ముకోవాలని కోరారు.

లబ్ధిదారురాలికి ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-మహదేవపూర్

మంథని నియోజకవర్గం మహదేవపూర్ మండలం కిష్టారావుపేట(అంబట్‌పల్లి) కి చెందిన సింగినేని సారక్క కు మంజూరైన రూ.25,000 ఎల్ఓసీని మంగళవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆస్పత్రి సహాయకులు అందచేశారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు తెలపగా ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుండి ఎల్ఓసి మంజూరు చేయించినందుకు లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-గణపురం

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా హనుమకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు భూపాలపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంధాని ప్రకటనలో తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో భూపాలపల్లి లారీ డ్రైవర్ అసోసియేషన్, చెల్పూర్,గొర్లవేడు ఆటో యూనియన్ కు సంబంధించిన డ్రైవర్లు ఇతర సిబ్బంది సుమారు 50 మంది వరకు పాల్గొని రక్తదానం చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంధాని పేర్కొన్నారు.

మేరు సంఘం జిల్లా అధ్యక్షునిగా పెండ్యాల సత్యనారాయణ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-మహదేవపూర్

మేరు సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షునిగా పెండ్యాల సత్యనారాయణ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అడక్ కమిటీ సలహాదారులు తాళ్ల సంపత్, మేరు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల రమణ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మేరు సంఘం జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు పెండ్యాల సత్యనారాయణకు మహదేవపూర్ మండల అధ్యక్షులు కోక్కు రమేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండాల మమత మనోహర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ మండల అధ్యక్షులు కొక్కు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల నరసింహస్వామి కార్యదర్శి కోక్కు మధుకర్, సంఘం మండల అధ్యక్షులు కోక్కు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి అడప రాజ రమణయ్య, కోశాధికారి పెండ్యాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా రేగుంట నర్సయ్య



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఎమ్మార్పీఎస్ టీఎస్ సింగరేణి ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన రేగుంట నర్సయ్య మాదిగను నియమించడం జరిగిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. మంగళవారం నియామక పత్రం నర్సయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సంఘము ఏ బాధ్యతలు అప్పగించిన పూర్తి స్థాయిలోనిర్వహిస్తామని ,సంఘము బలోపేతం చేయడం కోసం కషిచేస్తానని అన్నారు. అనంతరం నర్సయ్య మాదిగకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా ఇంచార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన మండల స్టాఫ్ నర్స్‌లకు అభినందనలు

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలంలోని పలువురు అభ్యర్థులు స్టాఫ్ నర్స్‌కు ఎంపికయ్యారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్టాఫ్ నర్స్ ఫలితాల్లో మండలంలోని ముద్దుల పల్లి గ్రామానికి చెందిన చకినారపు శశికళ, పూతల సౌందర్య, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న కళ్యాణి, భాగ్యలక్ష్మి, లత, సుజాత, ఎడపల్లి గ్రామానికి చెందిన మోతే మమత పెద్దంపేట గ్రామానికి చెందిన గావిడి కళ్యాణి ఎంపికయ్యారు. మండలానికి చెందిన అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్లఆయా గ్రామాల సర్పంచ్లు ఎంపీటీసీలు, బంధువులు, గ్రామస్తులు, అభిమానులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ నుండి 2024 సంవత్సరం టేబుల్ క్యాలెండర్ జెడ్పి చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి యల్ విజయ లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ కల్లెపు శోభ రఘుపతిరావు, జెడ్పిటిసిలు గుడాల అరుణ, లింగంపల్లి శారద ,ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బి. విజయపాల్ రెడ్డి, పర్యవేక్షకులు. జెడ్‌పిపి భూపాలపల్లి ప్రధాన కార్యదర్శి రామక రవీందర్, పర్యవేక్షకులు. ఎంపిపి, భూపాలపల్లి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్ ఉస్సేన్, నేతాజీ, మార్క శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్, శ్యామ్ సుందర్ , దేవేందర్, శ్రీనివాస చారి, పవన్ సాయి, రిషిత, రమాకాంత్ రెడ్డి, అభిలాష్, పంచాయితీ రాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు)లో మంగళవారం పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ అధ్వర్యంలో జెడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్, ఎంపీపీ బాన్సొడ రాణిబాయి రామరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యన్.సత్యంతో కలిసి పిఆర్టియు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజాన్ని ఉత్తమమైన మార్గంలో నడిపించే పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. సమస్యల పరిష్కారాలకు పోరాటం చేసే సంఘాలు మాత్రమే చిరస్థాయిగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా సహాధ్యక్షులు బి. కుమార స్వామి, జిల్లా కార్యదర్శి కె.అశోక్ కుమార్,అనిల్ కుమార్ , శరత్, ప్రకాష్ బాబు, రాజయ్య, లక్ష్మి, సునీత, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలం అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి అంబట్‌పల్లి గ్రామ పంచాయతీలోని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం నిర్వహించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. కుష్టు లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ఆరోగ్య కార్య కర్తను, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని వైద్యుడు డాక్టర్ రామారావు పూనెం అన్నారు. అనంతరం కుష్టు నిర్మూళనపై ప్రతిజ్ఞ చేయించారు. సత్య నారాయణ(నోడల్ పర్సన్), ఏఎన్ఎంలు సుజాత, లావణ్య, ఆశాలు సుజాత, స్వప్న, హెడ్మాస్టర్లు వసంత, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానుభావులను మరచిపోవద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

మహానుభావుల చరిత్రను నేటి ప్రజానీకం మరచిపోకుండా వారు చూపించిన మార్గంలో పయనించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాజీ రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో బస్టాండ్ కూడలిలో ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం, తాపీమేస్త్రి ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాలను వారు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... చత్రపతి శివాజీ తన రాజ్యంలో స్త్రీలను ఎంతో గౌరవించేవారని తెలిపారు. తల్లి మాటను జవదాటకుండా రాజ్యపాలన చేశాడని గుర్తు చేశారు. చత్రపతి శివాజీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాజ్యపాలన చేశాడని, ఛత్రపతి శివాజీగా గుర్తించి దైవంతో సమానంగా నేడు పూజిస్తున్నారన్నారు. మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని అహింస ద్వారా బ్రిటిష్ వాళ్ళను తరిమికొట్టాడని అలాంటి మహనీయుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేసినందుకు సంతోషకరమన్నారు. పెదవులు కోరుకుంటే రావని మనం చేసే కార్యక్రమాల ద్వారా మన నడవడికను పోరాటాన్ని సేవలను గుర్తించినప్పుడే పదవులు మన వెంట వస్తాయన్నారు. మహనీయుల బాటలను మరచిపోకుండా వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోటె ధర్మారావు,ఆర్య క్షత్రియ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, తాపీ మేస్త్రీల సంఘం నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ఆర్య క్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రాంతి రథం 'నవతెలంగాణ' పథం : ఎస్సై గోదరి రవికుమార్



నవతెలంగాణ-మంగపేట

మానవ మనుగడ కోసం సమజాభివృద్ధి కోసం ప్రగతి పథంలో ముందుకు నడిచే నడిపించే ఏకైక పత్రిక నవతెలంగాణ అని ఎస్సై గోదరి రవి కుమార్ అన్నారు. మంగళవారం ఆయన నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలీన వార్తల సేకరణలో, సమాజ సమస్యలపై సకాలంలో స్పందించే పత్రికా నవ తెలంగాణ అని అన్నారు. ప్రజా సమస్యల పై స్పందించే పత్రికగా ప్రజాభిమానాన్ని చూరగొందని అన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాలా యూత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రాజమల్ల సుకుమార్, పూజరి రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నవతెలంగాణ - మట్టేవాడ

రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా వరంగల్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసిపి యం. భోజరాజు, సూచనల మేరకు వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వరంగల్ ట్రాఫిక్ సిఐ వెంకన్న పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేని ద్వి చక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు నెంబర్ ప్లేట్ లను వేయించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ సిఐ వెంకన్న మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండ లైసెన్స్ కలిగి ఉండాలని, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. వాహనాలపై పరిమితి కి మించి ప్రయాణించరాదని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా జిల్లా పోలీసుల తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ ఎస్ఐలు పోలీసులు పాల్గొన్నారు.

కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ - చెన్నారావుపేట

ఉపాధ్యాయ పదవీ విరమణ పొంది కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సాదు మధుసూదన్ రెడ్డిని మంగళవారం మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ ఘనంగా సత్కరించారు. ఇటీవల కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, మండల కేసర్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్ యాదవ్, సర్పంచ్ తప్పెట రమేష్, మాజీ సర్పంచ్ మేకల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

నవతెలంగాణ - నెక్కొండ

నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రావుల హరీష్ రెడ్డిలు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బక్కి అశోక్,రావుల హరీష్ రెడ్డి,పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు గాంధీ ఆశయ సాధనకు కృషఒ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయి కష్ణ, మండల ఉపాధ్యక్షులు బానోత్ శంకర్ నాయక్, మేజర్ గ్రామ పంచాయితీ వార్డ్ సభ్యులు పోలిశెట్టి భాను ప్రకాష్, రామారాపు రాము, కాంగ్రెస్ నాయకులు కదురు సాంబయ్య, కక్కేర్ల నాగయ్య, బొమ్మెరబోయిన రమేష్, కునుసోత్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించేది లేదు

నవతెలంగాణ - చెన్నారావుపేట

కాంగ్రెస్ పార్టీ వీధి విధానాలకు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా సహించేది లేదని చెన్నారావుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నరసయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చెన్నారావుపేట గ్రామానికి చెందిన బొంత శ్రీను అనే వ్యక్తి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అని చెప్పుకుంటూ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక విధానాలకు పలుమార్లు పాల్పడినందుకు గ్రామ పార్టీ ఆదేశాల మేరకు పార్టీ నుండి బహిష్కరిస్తున్నమని ఇకనుండి పార్టీకి ఆయనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన గౌతమి విద్యార్థులు



నవతెలంగాణ -నెక్కొండ

నెక్కొండ మండల కేంద్రంలోని గౌతమి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో టాపర్ గా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ అనంతుల మురళీధర్, ప్రిన్సిపల్ కల్పనలు తెలిపారు. మంగళవారం నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ సంబురాలలో భాగంగా నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రైవేట్ పాఠశాలల విభాగంలో గౌతమీ విద్యానికేతన్కు చెందిన ముగ్గురు విద్యార్థుల బందం ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల విద్యార్థులు బి. సహజల్ యోధన్ శాస్త్రి ,జే. స్వరన్ కుమార్ ,కె. విశాల్ యాదవ్ లను పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనంతుల కల్పన , కరస్పాండెంట్ మురళీధర్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దయాకర్, మధుకర్ రెడ్డి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులకు అవగాహన



నవతెలంగాణ - ములుగు

ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి మండలంలోని నాలుగో తరగతి ఉద్యోగులకు సీజనల్ వ్యాధులు, ఆహార భద్రత అవగాహన, రుచికరమైన, నాణ్యమైన ఆహారం-అవగాహన-సూచనలు కొరకు సెక్రెటరీ ఆఫ్ గవర్నమెంట్ శరత్ ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ నరసింహారెడ్డి, పిఓ అంకిత్, డిడి పోచం, ఏటీడీఓ దేశిరామ్ ఆదేశాలతో రెండు రోజుల కార్యక్రమంలో బాగంగా మంగళవారం ప్రధానోపాధ్యాయుడు పి వేణుగోపాల్ అధ్యక్షతన అవగాహన శిక్షణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీలత, డాక్టర్ కే. మల్లికార్జున్, ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్, ఐసిడిఎస్ నుంచి ఓంకార్, దీనిలో 4 మండలాల నుంచి దాదాపు 60 మంది వర్కర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-సంగెం

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోదాటి శ్రీధర్ అన్నారు. మంగళావారం తెలంగాణా గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నూతన సంవత్సరబి2024 గోడ పత్రికను సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోదాటి శ్రీధర్ ఆధ్యర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 0 సంవత్సరాల నుండి ప్రభుత్వ విద్య బలోపేతానికి సంఘ పరంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ కౌన్సిలర్ మామిండ్ల బుచ్చిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాత్రి నాగరాజు,అనిల్ కుమార్,పవన్ కుమార్, కుమారస్వామి, యాక సాయిలు, కుమారస్వామి,అక్రమ్ అలీ, సంఘసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మహాదేవపూర్

మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ చికిత్స సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జగదీష్ మంగళవారంపేర్కొన్నారు. ఎదుగుదల లోపం, నరాల బలహీనత, దివ్యాంగ పిల్లలకు అందించే ఫిజియోథెరపీ చికిత్సను సద్వినియోగం చేసుకొని పిల్లల మానసికంగా ఎదగడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరేష్, సజన తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : డిటీఎఫ్

నవతెలంగాణ-మంగపేట

పెన్షన్ అమలు విధానంలో ప్రస్తుతం కొనసాగుతున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటీఎఫ్) జిల్లా ఉపాధ్యాయక్షుడు అల్లెం నాగ భూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిమ్మపేట జడ్పి పాఠశాలలో డిటిఎఫ్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను నాగ భూషణం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మేధావులు,అధికారులు,ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశమై చర్చించాలని అన్నారు. జీఓ నెం.317తో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. బకాయిలు ఉన్న పీఆర్సీ, డీఏ ఏరియల్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మంపేట జడ్పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు నాలి రాంబాబు, చారి, రవి కుమార్, అహ్మద్ పాషా, సత్య నారాయణ,నాగమ్మ,రమేష్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

నవతెలంగాణ-గణపురం

మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన వెంపటి కుమారస్వామి మృతిచెందాడు. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంపటి అశోక్ తండ్రి కావడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.

ఇంటి నుంచి యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రానికి చెందిన ఆకుల రాజు (35) మనస్థాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంటి నుండి వెళ్లిపోయినట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు. ఇంట్లో చిన్న తగాదాతో ఇంటి నుండి వెళ్లిపోయినట్లు తెలిపారు బాధితుని భార్య తండ్రి శీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి : ఎస్సై

నవతెలంగాణ -మహాముత్తారం

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి అని స్థానిక ఎస్సై సుధాకర్ దసరి అన్నారు. మంగళవారం ఆదివాసీ గిరిజన జాతర మేడారం దృష్టిలో పెట్టుకొని మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రధాన చౌరస్తాలో కాటారం నుండి మేడారానికి వచ్చిపోయే వాహనలను తనిఖీ చేశారు. వాహనదారులు ఎవరు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, తప్పనిసరిగా వ్యక్తిగత లైసెన్సు వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సరైన పత్రాలు లేని వాటికీ పెండింగ్ చలాన్ వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

108 సేవల పట్ల అవగాహన

నవతెలంగాణ-గణపురం

మండలంలోని చల్పూర్ ప్రాథమిక కేంద్రంలో మంగళవారం 108 అంబులెన్స్ సర్వీసెస్ పై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బేబీ నుండి మూడు సంవత్సరాల వరకు ఏ విధంగా ఉపయోగించుకోవాలో, అంబులెన్స్ లో ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన పరికరాల గురించి అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. భూపాలపల్లి జిల్లాలోని ప్రజలందరూ నియోనటల్ వెహికల్, 108, 102 సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ, ఏఎన్ఎం 108 స్టాఫ్ ఎమర్జెన్సీ టెక్నీషియన్ చంటి, పైలట్ రాజశేఖర్ పాల్గొన్నారు.



గిరిజన కుక్ కామాటిలకు అవగాహన

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ లోని గిరిజన వసతి గృహాల్లో పనిచేస్తున్న వంట, కమాటీలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, డైరెక్టర్ సూచన మేరకు ఎటూరునాగారం డి డి ఆదేశాలతో మహాదేవపూర్ గిరిజన వసతి గృహల్లో కుక్, కామాటిలకు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల కు నాణ్యమైన రుచికరమైన ఆహారం అందించే విషయంలో భద్రత పాటించాలని పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ ఆంజనేయులు, ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ కె, శివరాణి, ఏసిఎం ఓ జి రవిశంకర్, వసతి గహాల వార్డెన్లు శారదా, శివ లక్ష్మి సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

బిజినెస్

ప్రయివేటు టెల్కోల వసూళ్ల ఎత్తుగడ..!

- 2జి, 3జి సేవల నిలిపివేతకు ప్రతిపాదనలు : ట్రాయ్‌తో సంప్రదింపులు
- 4జి, 5జితో రెవెన్యూ పెంచుకునే ప్రయత్నం
- బీఎస్ఎన్ఎల్‌ను దెబ్బగొట్టే కుట్ర
- 25 కోట్ల పైగా మందిపై భారం



న్యూఢిల్లీ : పేదలు, పెద్ద వయస్సు వాళ్లను పీక్కు తినడానికి ప్రయివేటు టెలికం కంపెనీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. దేశంలో 2జి, 3జి సేవలను నిలిపి వేయాలని ఆ సంస్థలు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనం. దీంతో మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్)ను దెబ్బగొట్టే ప్రక్రియను ముమ్మరం చేశాయని స్పష్టమవుతోంది. దేశంలో ఇంటర్నెట్ సేవలు వేగంగా విస్తరిస్తున్నాయి. టెల్కోలు 4జి, 5జి సేవలను పెంచుతున్నాయి. అయినప్పటికీ 2జి, 3జి సర్వీసులు వాడేవారు దేశంలో కోట్లాది మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలు, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కోట్లాది మంది పెద్దవాళ్లు, నిరక్షరాస్యులు ఇంకా ఫీచర్ ఫోన్లనే వాడుతున్నారు. అందులో 2జి సేవలనే వినియోగించుకుంటున్నారు. ఈ విభాగంలో బిఎస్ఎన్ఎల్ విస్తృతంగా వినియోగదారులను కలిగి ఉంది. కాగా.. 2జి, 3జి సేవలను పూర్తిగా రద్దు చేయాలని రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా టెల్కోలు తాజాగా టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్)కు ప్రతిపాదనలు అందించాయి. దీనికి సంబంధించి కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరాయి. కాగా దీనిపై భారతీ ఎయిర్‌టెల్ మాత్రం తన అభిప్రాయాన్ని వెల్లడించలేదు. దేశంలో దాదాపు 25 కోట్ల మంది పైగా ఇప్పటికీ 2జి నెట్‌వర్క్‌ను వాడుతున్నారని అంచనా.

2జి, 3జి సేవలను పూర్తిగా నిలిపివేసేలా కేంద్ర ప్రభుత్వమే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కోరింది. ఆ రెండు స్పెక్ట్రమ్‌లను మూసివేసినప్పుడే ప్రజలంతా 4జి, 5జిలోకి మారతారని పేర్కొంది. దీనివల్ల అనవసరపు నెట్‌వర్క్ వినియోగ భారం తగ్గుతుందని తెలిపింది. వివిధ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో 5జి ఎకోసిస్టమ్‌తో యువతలో నైపుణ్యాలు పెంచుకోవడంతో పాటు తమ కలలను సాకారం చేసుకునేందుకు అవకాశాలను ఇస్తాయని జియో పేర్కొంది. ఇప్పటికీ దేశంలో 2జి నెట్‌వర్క్‌ను ఉపయోగించే వారి సంఖ్య భారీగా ఉందని వొడాఫోన్ ఇండియా పేర్కొంది. 4జి, 5జి సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ చాలామంది ఆ సేవలను వినియోగించుకోలేకపోతున్నారని తెలిపింది. 2జి సేవలను రద్దు చేస్తేనే 4జి, 5జికి అప్‌గ్రేడ్ అవుతారని పేర్కొంది.

గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది ఇప్పటికీ ఫీచర్ ఫోన్లనే వినియోగిస్తున్నారు. 4జి, 5జి కోసం పేదలు స్మార్ట్‌ఫోన్‌కు మారాలంటే భారం పడనుంది. ఇప్పటికీ అనేక మందికి స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ కూడా తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో 2జి, 3జి సర్వీసులను పూర్తిగా రద్దు చేయాలని ప్రయివేటు టెల్కోలు ప్రతిపాదనలు చేయడమంటే ప్రజలపై ఆర్థిక భారం మోపడమేనని, వారిని దోచుకోవడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. టెలికం కంపెనీలు తమ ఆదాయాలను పెంచుకోవడానికి వేస్తున్న పెద్ద ఎత్తుగడ అని విమర్శిస్తున్నారు. మరోవైపు 2జి విభాగంలో అత్యధిక మంది వినియోగదారులు కలిగి ఉన్న బిఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో ఇది ఒక భాగమని విశ్లేషిస్తున్నారు.

62 కొత్త మార్కెట్లలో ఐకియా డోర్ స్టెప్ డెలివరీ సేవలు

నవతెలంగాణ - హైదరాబాద్



ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన స్వీడిష్ ఓమ్నిచానెల్ గృహోపకరణాల రిటైలర్ ఐకియా, తమ ఈ-కామర్స్ డెలివరీలను మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 62 జిల్లాల్లో వేల సంఖ్యలో పిన్ కోడ్లకు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఐకియా స్టోర్ల వద్ద షాపింగ్ చేయడానికి సమీపంలోని నగరాలు, పట్టణాల నుండి వస్తోన్న వేలాది మంది కస్టమర్ల ఉత్సాహం, డిమాండ్, సందర్శనలను చూస్తూనే ఉన్నందున ఈ సేవల విస్తరణ జరిగింది. ఈ కొత్త కస్టమర్ మీటింగ్ పాయింట్లు 7,500కి పైగా చక్కగా రూపొందిన, సరసమైన, మంచి నాణ్యత, పనితీరు, స్థిరమైన గృహోపకరణ ఉత్పత్తులతో పాటు ఇంటి కోసం ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తాయి. కస్టమర్లు ఐకియా యాప్ని ఉపయోగించి తమకు ఇష్టమైన ఉత్పత్తులను కొనుగోలు చేయగలరు, బ్రాండ్ వెబ్సైట్ ఐకియా. ఇన్ ద్వారా లేదా దాని 'షాప్ బై ఫోన్' సహాయ సేవ ద్వారా ఆన్లైన్ ఆర్డర్ చేయవచ్చు.

ఎలీజీ క్యూఎస్ఈడి 83 సిరీస్ ఆవిష్కరణ

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ కన్స్యూమర్ డ్యూరబుల్ బ్రాండ్ ఎలీజీ ఎలక్ట్రానిక్స్ తన ఎలీ క్యూఎస్ఈడి (క్వాంటమ్ నానోసెల్ డిస్ప్లే) 83 సిరీస్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది హైదరాబాద్లో ఎల్ఈడీ తదుపరి తరం పరిణామం. విజువల్ ఎక్సలెన్స్, లీనమయ్యే వినోదం కోసం కొత్త ప్రమాణాన్ని సెట్ చేయడం, ఎలీజీ క్యూనెడ్ క్వాంటమ్ నానోసెల్ డిస్ప్లే 83 సిరీస్ ద్వారా సంపూర్ణ వీక్షణ అనుభవాన్ని అందించడం దీని ఉద్దేశం. హైదరాబాద్లోని క్రోమా కూకట్పల్లి స్టోర్లో దీన్ని లాంచ్ చేశారు. ప్రత్యేకంగా 55 క్యూఎస్ఇడి 83 మోడల్ను ఆవిష్కరించారు. ముఖ్య హాజరీలలో రీజనల్ బిజినెస్ హెడ్ శశికిరణ్ రావు, బ్రాంచ్ మేనేజర్ జీవన్ కొమ్మినేని ఉన్నారు.

కేరళలో పిపిపి-మోడల్ ఏటీఎల్ మొదటి వార్షికోత్సవం

నవతెలంగాణ - హైదరాబాద్

ఒప్పో ఇండియా, నీతి ఆయోగ్ భాగస్వామ్యంలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్తో కలిసి, త్రిసూర్ జిల్లా కురియాచిరాలోని సెయింట్ పాల్స్ సీఈ హెచ్ఎస్ఎస్ పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ మోడల్ ఏటీఎల్ ద్వారా ఒక-ఏడాదిలో చేరుకున్న మైలురాయిని గుర్తుచేసుకునేందుకు గ్రాండ్ స్టూడెంట్ ఇన్నోవేషన్ షోకేస్ ను నిర్వహించింది. సెయింట్ పాల్స్, సమీపంలోని సముదాయాలలోని పాఠశాలల విద్యార్థులు గత ఏడాదిలో అభివృద్ధి చేసిన రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, ర్యాపిడ్ ప్రోటోటైపింగ్ ప్రాజెక్టను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం సాధికారత, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తిని సృష్టించడం, యువతలో ఎంటర్ప్రెన్యూర్షిప్ మరియు నైపుణ్యాలను పెంపొందించడంపై భారత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న అంశాలకు అనుగుణంగా ఉంది.

రుషీల్ డెకర్ లాభాల్లో 11% వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రుషీల్ డెకర్ నికర లాభాలు 11.03 శాతం పెరిగి రూ.11.36 కోట్లుగా నమోద య్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10.23 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.210.31 కోట్లుగా ఉన్న నికర అమ్మకాలు.. గడిచిన క్యూ3లో 1.34 శాతం పెరిగి రూ.213 కోట్లుగా నమోదయ్యాయి. వచ్చే 3-4 ఏళ్లలో తమ ఎగుమతులను రూ.500 కోట్లకు చేర్చాలని నిర్దేశించుకున్నామని రుషీల్ డెకర్ లిమిటెడ్ సిఎండి కృపేష్ ఠక్కర్ పేర్కొన్నారు. తాము దీర్ఘకాల వృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

హిజాబ్ మా హక్కు



- రాజస్థాన్‌లో నినదించిన ముస్లిం బాలికలు
- బీజేపీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలపై నిరసన

జైపూర్ : కొందరు విద్యార్థులు హిజాబ్ ధరించడం వల్లనే పాఠశాల వాతావరణం కలుషితమైపోయిందంటూ రాజస్థాన్‌లోని హవామహల్ ఎమ్మెల్యే, హిందూ మత బోధకుడు బాబా బల్ముకుంద్ ఆచార్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దీనిపై జైపూర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ముస్లిం విద్యార్థినులు తీవ్ర నిరసన తెలిపారు. ఎమ్మెల్యే ప్రకటనను వారంతా ఖండిస్తూ హిజాబ్ ధారణ తమ హక్కు అని నినదించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గంగాపోల్ ప్రాంతంలోని ప్రభుత్వ సీనియర్ సెకండరీ బాలికల పాఠశాల విద్యార్థినులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

'మేము ఏం ధరించాలో చెప్పడానికి ఆయన ఎవరు? మేము ఇక్కడికి చదువుకోవడానికి వచ్చాం. చదువుకుంటాం. ఆచార్య క్షమాపణ చెప్పే వరకూ నిరసన ఆపం. ఆయన ఎప్పుడూ ముస్లింలనే లక్ష్యంగా చేసుకుంటున్నారు.

కొన్నిసార్లు ముస్లింలు నడుపుతున్న మాంసం దుకాణాలను టార్గెట్ చేశారు. ఇప్పుడేమో హిజాబ్ మీద. పాఠశాలలో హిజాబ్ వద్దని ఇవాళ అన్నారు. హిజాబ్ ధరించి పాఠశాలకు రాకుండా రేపు మమ్మల్ని అడ్డుకోవచ్చు. పాఠశాలలో చదువుకుంటున్న ముస్లిం విద్యార్థులే ఆయన లక్ష్యం. హిజాబ్ ధరించడం మా హక్కు' అని వారు స్పష్టం చేశారు. కాగా జరిగిన ఘటనపై ఫిర్యాదు అందితే విచారిస్తామని పోలీసులు తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఈ విషయంపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు.

రిపబ్లిక్ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ఆచార్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయన హిజాబ్ ధారణపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిని సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. 'అసలు ఈ హిజాబ్ దేనికి సంబంధించింది? బాలికలకు వివాహం అయిందనడానికి అది గుర్తా?' అంటూ ఆయన ఉపాధ్యాయులను ప్రశ్నించారు. హిజాబ్ ధరించిన వారు శ్వాస తీసుకోగలరా అని కూడా అడిగారు. హిజాబ్ కారణంగా పాఠశాల వాతావరణం కలుషితమైపోయిందని చెప్పారు. పాఠశాలలో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే ఆచార్య భారత్ మాతా కీ జై, సరస్వతి మాతా కీ జై అంటూ నినాదాలు కూడా చేశారు. కొందరు విద్యార్థినులు తనతో గొంతు కలపకపోవడాన్ని గమనించి 'నాతో కలిసి నినాదాలు చేయవద్దని వారికి చెప్పారు' అని అన్నారు. ఆ తర్వాత జై శ్రీరాం అని కూడా ఆయన నినదించారు.

పాఠశాలలో వేర్వేరు డ్రస్ కోడ్లు ఎలా ఉంటాయని ఆచార్య ప్రశ్నించారు. ఇదే విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులను అడిగానని చెప్పారు. రెండు సంవత్సరాల పిల్లల నుండి పదో తరగతి చదివే వారి వరకూ హిజాబ్ లేదా బురఖా ధరిస్తున్నారని తెలిపారు. ఆచార్య గత సంవత్సరం జరిగిన రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో హవామహల్ నియోజకవర్గం నుండి తొలిసారిగా స్వల్ప మెజారిటీతో ఎన్నికయ్యారు.

అప్పటి నుండి ఆయన తన మాటలు, చేతల ద్వారా వార్తల్లో నిలుస్తున్నారు. గతంలో ఆయన మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. అవన్నీ అక్రమంగా ఏర్పాటు చేసినవని, వాటిని తొలగించాలని అధికారులకు హుకుం జారీ చేశారు. ఛోటీ కాశీగా పేరుగాంచిన జైపూర్‌ను కరాచీ కానివ్వబోనని చెప్పారు. రాష్ట్రంలోని పీతావస్ గ్రామంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఓ వ్యక్తిపై దాడి చేశారని, అతనిపై ఉమ్మేశారని ఆచార్యపై ఆరోపణలు ఉన్నాయి.

మోడీ గ్యారెంటీ ఒక 'జుమ్లా'

- భారత్‌లో అసలైన సమస్య నిరుద్యోగం, ద్రవ్యోల్బణం
- అందుకే ఇజ్రాయెల్‌కు వెళ్లటానికి సాహసిస్తున్న యువత
- కేంద్రంపై ప్రియాంక గాంధీ ఆగ్రహం



న్యూఢిల్లీ : ఇజ్రాయెల్‌లో ఉపాధి కోసం భారత యువతను అక్కడకు తరలించే చర్యపై కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ సర్కారు తీరును తప్పుబట్టారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, మోడీ గ్యారెంటీ అని చెప్పే మాటలు కేవలం ఒక 'జుమ్లా(అబద్ధపు హామీ)'గా ఆమె అభివర్ణించారు.

భారత్ ఎదుర్కొంటున్న అసలైన సమస్య నిరుద్యోగం, ద్రవ్యోల్బణమనీ, దీనికి బీజేపీ సర్కారు వద్ద పరిష్కారం లేదని ప్రియాంక అన్నారు. ఇజ్రాయెల్ దేశంలో పని కోసం కార్మికులను పంపటానికి నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ప్రజలు క్యూలో నిలబడిన ఒక వీడియోను ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్‌లో షేర్ చేశారు.

" ఒకవేళ ఎక్కడైనా యుద్ధం అనేది జరిగితే.. తొలుత మనం అక్కడున్న మన పౌరులను రక్షించుకుంటాం. తర్వాత వారిని మన దేశానికి తీసుకొస్తాం. అయితే, యుద్ధవాతావరణంలో ఉన్న ఇజ్రాయెల్‌కు వెళ్లటానికి సాహసిస్తున్న వేలాది మంది యువతను ప్రభుత్వం కనీసం రక్షించటంలేదు. ఇది నేటి నిరుద్యోగ ఫలితమే" అని ప్రియాంక 'ఎక్స్' పోస్ట్‌లో హిందీలో రాసుకొచ్చారు. 'ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ', 'ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు', 'మోడీ గారి గ్యారెంటీ' అంటూ ఎన్నికల సమయంలో చెప్పే మాటలు కేవలం జుమ్లా అని ఆమె పేర్కొన్నారు. యువతకు వారి దేశంలో ఉద్యోగాలు రావటం లేదని ప్రశ్నించారు. " యుద్ధవాతావరణంలో ఉన్న ఇజ్రాయెల్‌కు యువతను పంపించటానికి భారత ప్రభుత్వం దేని ఆధారంగా అనుమతులు జారీ చేసింది? మన యువత జీవితాన్ని రక్షించే బాధ్యత ఎవరు తీసుకుంటారు?" అని ప్రియాంక ప్రశ్నించారు. భారత యువత ఇదంతా అర్థం చేసుకుంటున్నదని వివరించారు.

రేవంత్ చాలా ఈజీగా కేసీఆర్‌ని దించేశారు

- సీనియర్ నేత మోత్కుపల్లి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్‌ను దించేందుకు ఎంతో మంది ప్రయత్నించినా సాధ్యం కాలేదని కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి చాలా ఈజీగా ఆయన్ను దించేశారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు అరికెల నర్సారెడ్డి, రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడటంతో ప్రజలు ఆనందంగా ఉన్నారని చెప్పారు.

కేసీఆర్ నియంత పాలనను అంతమొందించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఓడిపోయిన తెల్లారి నుంచే కేటీఆర్ బయటకు వచ్చి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సోనియా ఇచ్చిన తెలంగాణను తానే తెచ్చానని కేసీఆర్ డబ్బా కొట్టుకున్నారని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ ఆస్తులపై విచారణ చేయించనుందని తెలిపారు.

మైనార్టీలపై కేటీఆర్ దొంగ ప్రేమ : ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

మాజీ మంత్రి కేటీఆర్ మైనార్టీలపై దొంగ ప్రేమ ఒలకపోస్తున్నారని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు.

ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలతో రెండున సీఎం భేటీ

- మహేష్ కుమార్ గౌడ్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెడుతోంది. ఫిబ్రవరి రెండున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో బహి రంగ సభ నిర్వహించి ఎన్నికల శంఖారావాన్ని మోగించనుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలతో సీఎం రేవంత్ భేటీ అవు తారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభ వన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లి స్థూపం వద్ద స్మృతివనం నిర్మిస్తామని నాడు హామీ ఇచ్చారని చెప్పారు. రేవంత్ ఆ మాట నిలబెట్టుకోబోతున్నారని తెలిపారు. అక్కడి నుంచే సీఎం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. దేవుడు, మతం పేరిట రాజకీయాలు చేసే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఇంద్రవెల్లి సభ నాంది పలుకబోతోందని హెచ్చరించారు. కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభ ఉంటుందన్నారు.

మూడు కోట్లకు చేరువలో కోవిడ్ మరణాలు!



న్యూయార్క్ : కోవిడ్-19 కారణంగా మరణించిన వారి మరణాలపైన లండన్ నుంచి వెలువడే ఎకనామిస్ట్ మ్యాగజైన్ తాజా గణాంకాలను ప్రచురించింది. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ వల్ల చనిపోయిన వారి సంఖ్య 28.5మిలియన్లు అని ఎకనామిస్టు రాసింది. ఈ సంఖ్య 2023లో అధికారికంగా ప్రకటించిన 7మిలియన్ల కంటే 4.1రెట్లు ఎక్కువ. అమెరికాలో కోవిడ్ అక్టోబర్ మధ్యలో వేగవంతమై నూతన సంవత్సరం నాటికి శిఖరాగ్ర స్థాయికి చేరింది. గత మే నెలలో కోవిడ్ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ (పిహెచ్ఇ) ని బైడెన్ రద్దు చేయాలని నిర్ణయించిన తరువాత కోవిడ్ వల్ల సంభవించిన మరణాలను అధికారికంగా తక్కువచేసి చూపటం జరుగుతోంది. ఈ వారారంభంలో రోజుకు 10లక్షల కోవిడ్ ఇన్‌ఫెక్షన్లు ఉండగా అమెరికాలో కోవిడ్ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతున్నట్టుగా చూపిస్తున్నారు. తాజా కోవిడ్ వెల్లువలో గత మూడు నెలల కాలంలో 10కోట్ల అమెరికన్లకు కోవిడ్ సోకింది. ఇది అమెరికా మొత్తం జనాభాలో మూడవ వంతు. ఇలా కోవిడ్ సోకినవారిలో చాలామందికి గతంలో కోవిడ్ సోకిన చరిత్ర ఉంది. దీనితో వీరికి సుదీర్ఘ కాలం కోవిడ్ సోకే అవకాశం ఉంటుంది. అంతేకాదు కోవిడ్ పర్యవసానంగా వచ్చే గుండె జబ్బుల, ఇతర కోవిడ్ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ అంచనాలను మిగిలిన ప్రపంచానికి వర్తింపజేసినప్పుడు నేడు ప్రపంచ వ్యాప్తంగా చెలరేగుతున్న జెఎన్-1 రకం కోవిడ్ వల్ల 100 నుంచి 200కోట్ల మందికి కోవిడ్ సోకి ఉంటుంది. అంటే రానున్న రోజుల్లో అనేక లక్షల మందికి దీర్ఘ కాలం కొనసాగే కోవిడ్ సోకే వీలుంటుంది. ఇలా కోవిడ్ మరలా మరలా సోకటంవల్ల గుండె జబ్బులు, మెటబాలిక్, న్యూరలాజికల్ సమస్యలు తలెత్తుతున్నాయనే ఆందోళన సర్వత్రావుంది. డెసెంబర్ నెలలో 10వేలమంది చనిపోయారని 2024లో పెట్టిన మొదటి పత్రికా సమావేశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన విషయాన్ని మెయిన్‌స్ట్రీమ్ మీడియా పట్టించుకోవటంగానీ, ఈ ప్రమాదం పర్యవసానాలను గురించి హెచ్చరిం చటంగానీ చేయలేదు. కోవిడ్ మరణాల సంఖ్య వాస్తవ మరణాలను ప్రతిబింబించటం లేదని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

'ట్రంప్ గెలిస్తే పుతిన్‌తో అవగాహనకు వస్తాడు : చెక్ ప్రెసిడెంట్



న్యూయార్క్ : డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యే సాధ్యతవల్ల ఏర్పడే అననుకూల పర్యవసానాలను ఎదుర్కొనేందుకు ఐరోపా దేశాలు సంసిద్ధంగా ఉండాలని చెక్ ప్రెసిడెంట్ పీటర్ పావేల్ అన్నాడు. నవంబర్ లో జరిగే ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ గెలవటం జరిగితే ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాడీమీర్ పుతిన్‌తో ఒక ఒప్పందానికి వచ్చే అవకాశం ఉంటుందని, అటువంటి ఒప్పందం ఉక్రెయిన్ కు గానీ, ఐరోపా కుగానీ ఏవిధంగాను లాభసాటిగా ఉండదని 'రేడియో జుర్నల్' అనే రేడియో స్టేషన్ కి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ లో పావేల్ హెచ్చరించాడు. "అమెరికాతోగల స్నేహ సంబంధాలను చెడగొట్టా లనిగానీ, మిత్ర దేశమైన అమెరికాకు సవాలు విసరాలనిగానీ నేను అనటం లేదు. అయితే అనేక సమస్యలను డోనాల్డ్ ట్రంప్ వేరే విధంగా అర్థం చేసుకుంటున్నాడన్న విషయాన్ని మనం వాస్తవ దక్పథంతో అంగీకరించాలి. ఒకవేళ ట్రంప్ గెలిస్తే మనం అమెరికా ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలి. అదే సమయంలో మనం దానితోవచ్చే పర్యవసానాలను ఎదుర్కొనేందుకు సిద్ధపడాలి" అని పావెల్ స్పష్టం చేశాడు.

ప్రస్తుత అమెరికా అధ్యక్షుడైన జో బైడెన్ లాగానే డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ సంవత్సరం నవంబర్ లో జరగనున్నఎన్నికల్లో అధ్యక్ష పదవికోసం పోటీప డుతున్నారు. తాను అధికారంలోగనుక ఉండివుంటే అసలు ఉక్రెయిన్ యుద్ధమే జరిగేది కాదని ట్రంప్ అనేక సార్లు చెప్పాడు. తనకు రష్యా, ఉక్రెయిన్ నాయకులతో సత్సంబంధాలున్నాయని ఆయన పదేపదే చెబుతుంటాడు. యుద్ధాన్ని ముగించేందుకు చర్చించటానికి తాను సరియైన స్థితిలో ఉన్నానని కూడా ఆయన చెబుతున్నాడు. అయితే ట్రంప్ తన శాంతి ఒప్పంద స్వరూపం ఎలా ఉంటుందో ఎప్పుడూ చెప్పలేదు. ట్రంప్ ధోరణి చాలా ప్రమాదకరంగా ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాడీమీర్ జెలెన్స్కీ అన్నాడు. జాతీయ భద్రతా ప్యాకేజీ కింద 106బిల్లియన్ల నిధుల ఆమోదం జరగకుండా రిపబ్లికన్లు అడ్డుపడ్డారు. దీనిలో 60బిల్లియన్లు ఉక్రెయిన్ కు అందించే సహాయం కోసం ఉద్దేశింపబడ్డాయి.

బీజేపీతో పొత్తు ఉండదు : అన్నా డీఎంకే

చెన్నయ్ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండబోదని అన్నా డీఎంకే తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టులోనే ఎన్డీఏ కూటమి నుండి అన్నా డీఎంకే బయటకు వచ్చింది. రెండు కోట్ల మంది పార్టీ కార్యకర్తల మనోభావాలను, ఆకాంక్షలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. తాజాగా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని ఆ పార్టీ నాయకుడు డి.జయకుమార్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల కోసం సీట్ల సర్దుబాటుపై వివిధ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, దీనిపై సరైన సమయంలో ప్రకటన చేస్తామని ఆయన తెలిపారు.

సీట్ల సర్దుబాటుపై చర్చించేందుకు అన్నా డీఎంకే ఓ కమిటీని ఏర్పాటు చేసింది. దానితో పాటు ఎన్నికల ప్రచార కమిటీని కూడా నియమించింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై తన పార్టీ కంటే తనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చుకుంటారని జయకుమార్ ఎత్తిపొడిచారు. 'ఎప్పుడూ జరగని విషయాలపై అన్నామలై ప్రకటనలు చేస్తుంటారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి ఆయన ఇలా చేస్తారు. అయితే ఈ ఎత్తుగడ ఫలించదు' అని అన్నారు.

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అన్నాదురైపై అన్నామలై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో బీజేపీతో సంబంధాలను అన్నా డీఎంకే తెంచుకుంది. '1950 ప్రాంతంలో మదురైలో జరిగిన ఓ కార్యక్రమంలో హిందూ విశ్వాసాలకు వ్యతిరేకంగా అన్నాదురై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. వీటిని స్వాతంత్ర్య సమరయోధుడు పశుంపన్ ముత్తుమర్లిగ తేవర్ వ్యతిరేకించారు' అని అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అన్నా డీఎంకేకు ఆగ్రహాన్ని కలిగించాయి. 1949లో అన్నాదురై డీఎంకేను స్థాపించారు. 1967లో తమిళనాడులో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్‌కు ఆయన రాజకీయ గురువు. ఎంజీఆర్ 1972లో అన్నా డీఎంకేను ఏర్పాటు చేశారు.

ఈడీ ముందుకు తేజస్వీ

- ల్యాండ్ ఫర్ జాబ్ మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించిన అధికారులు



పాట్నా : బీహార్‌లో రాజకీయ మార్పులు చోటు చేసుకున్న తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ విచారణలతో వేగం పెంచుతున్నది. రైల్వేలో ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కామ్ కేసులో సోమవారం బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఈడీ విచారించిన విషయం విదితమే. దాని తర్వాతి రోజే మంగళవారం నాడు లాలూ కుమారుడు, బీహార్ తాజా మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ను దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. ఇదే కేసులో మనీ లాండరింగ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఆయనను విచారించారు.

ఉదయం 11.25 గంటలకు పాట్నాలోని ఈడీ కార్యాలయానికి తేజస్వీ చేరుకున్నారు. అక్కడ ఆయన మద్దతుదారులు ఈడీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు వినిపించారు. ఇదే కేసులో తేజస్వీని ఈడీ గతేడాది ఏప్రిల్‌లో ఎనిమిది గంటల పాటు విచారించింది. గతేడాది డిసెంబర్ 22న ఈడీ పంపిన సమన్లను తేజస్వీ పట్టించుకోలేదు. ఈ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఈడీ పది గంటల పాటు విచారించిన విషయం విదితమే.

15 మంది పీఎఫ్ఐ కార్యకర్తలకు మరణశిక్ష

తిరువనంతపురం : కేరళలో బీజేపీ నాయకుడు రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన 15 మందికి మరణశిక్ష పడింది. ఈ మేరకు మావెలిక్కరల అడిషనల్ సెషన్స్ జడ్జి వి.జి శ్రీదేవీ ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఈ తీర్పును కేరళ హైకోర్టు ధృవీకరించాల్సిన అవసరం ఉన్నది. రంజిత్ శ్రీనివాసన్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సెక్రెటరీగా పని చేశారు. 2021, డిసెంబర్ 19న అలప్పుజలోని తన ఇంటిలో రంజిత్ శ్రీనివాసన్ అతని భార్య తల్లి, బిడ్డ ముందే దారుణ హత్యకు గురయ్యారు.

డాక్టర్ రెడ్డీస్‌కు రూ.1,379 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ 2023-24 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 10.6 శాతం వృద్ధితో రూ.1,378.9 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,237.90 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.6,789.80 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 6.6 శాతం వృద్ధితో రూ.7,236.80 కోట్లకు చేరింది. " మరో త్రైమాసికంలోనూ మేము ఇది వరకు ఎప్పుడూ లేని స్థాయిలో అమ్మకాల ప్రగతిని కనబర్చాము. కొత్త ఉత్పత్తుల ప్రగతికి తోడు అమెరికా మార్కెట్‌లో వ్యాపార వాటా పెరిగింది. యూరప్‌లోనూ కొత్త ఉత్పత్తులకు మద్దతు లభించింది. కీలక వ్యాపారాల బలోపేతాన్ని కొనసాగిస్తాం." అని డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్ జీవి ప్రసాద్ పేర్కొన్నారు. జనరిక్ ఉత్పత్తుల గ్లోబల్ వ్యాపారం 7 శాతం పెరిగి రికార్డ్ స్థాయిలో రూ.6310 కోట్లకు చేరింది. భారత్‌లో 5 శాతం వృద్ధితో రూ.1180 కోట్ల రెవెన్యూ చోటు చేసుకుంది. దేశంలో మూడు కొత్త బ్రాండ్లను విడుదల చేసినట్లు వెల్లడించింది.

డబ్బా కొట్టుకోవటం కాదు... హామీలపై శ్రద్ధ చూపండి...

- కాంగ్రెస్‌కు మాజీ మంత్రి హరీశ్ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేయని పనులకు డబ్బా కొట్టుకునే బదులు ఎన్నికల హామీల అమలుపై శ్రద్ధ చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సూచించారు. స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందించే ప్రభుత్వ కార్యక్రమం 'వంట అయినంక గరిటె తిప్పినట్టు' ఉందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సుల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే, అది తమ ఘనతగా కాంగ్రెస్ హడావుడి చేస్తుండటం దౌర్భాగ్యమని తెలిపారు.. ఫిబ్రవరి 1, 2024 న గ్రూప్ 1 నోటిఫికేషన్ వేస్తామన్న హామీ అమలు మరిచిన ఆ పార్టీ దాన్నుంచి దృష్టి మరల్చేందుకే ఇలాంటి ఆర్భాటాలు చేస్తున్నదని పేర్కొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం, ఏడాదిలోగా 2 లక్షల పోస్టులను భర్తీ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆమోదించి, అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేకుండా, ఏడాదిలోపే అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తుచేశారు. గతంలో ప్రారంభించిన నియామకాల ప్రక్రియను వాటి షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. ఆ పార్టీ చెప్పినట్టుగా ఫిబ్రవరి 1న గ్రూప్ 1 నోటిఫికేషన్, అలాగే ఏప్రిల్ 1న గ్రూప్ 2, జూన్ 1న గ్రూప్ 3,4 నియామకాలకు నోటిఫికేషన్, మార్చి1న పోలీసు సహా తరహా యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నర్సింగ్ ఆఫీసర్లకు శుభాకాంక్షలు.

స్టాఫ్ నర్సులుగా ఎంపికై బుధవారం నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మన్ననలు పొందేలా అత్యుత్తమ సేవలందించి, ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. మొత్తం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్బీ)ని అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సుల సేవలను గుర్తించి, వారి గౌరవాన్ని మరింత పెంచేలా వృత్తి పేరును ఉన్నతీకరించిందని తెలిపారు.